ఆదివారం

ప్రజాశక్తి

ఆగస్టు 1, 2004



కాలంతో పోటీ...

బుల్లెట్ రైళ్ళు...

హ్యాపీ బర్త్‌డే

(1-8-2004 నుండి 7-8-2004 వరకు)

రినీత్
1సం॥. 1-8-2003
హెలీనా దీపలత
కనిగిరి-ప్రకాశం



అజిత
1సం॥. 1-8-2003
లక్ష్మి-శ్రీనివాస్
కొత్తగూడెం-ఖమ్మం

కంచర్ల మురళి
3సం॥. 1-8-2001
మరియమ్మ-కృష్ణ

టి.ఆర్. చాందిని
10సం॥. 2-8-1994
శోభన-రమేష్
గుంటూరు

కె. చక్కని భూమిక
2సం॥. 2-8-2002
మద్దమ్మ-నరసయ్య
కల్లూరు-కర్నూలు

కె.సుందరయ్య
3సం॥. 2-8-2001
కోటేశ్వరి-వెంకటేశ్వరరావు
దుర్గాపురం-విజయవాడ

షేక్ మహబుబ్
1సం॥. 3-8-2003
రిహానాబేగం-శఫియోద్దీన్
కుప్పానగర్-మెదక్

బి. వినీత
2సం॥. 4-8-2002
విజయలక్ష్మి-సత్యనారాయణ
చింతరేవుపల్లి-ఖమ్మం

సందు సాయి వెన్నెల
6సం॥. 5-8-1998
రంగమ్మ-వెంకటేశ్వరరావు
దరిశి-ప్రకాశం

జి.మమత
9సం॥. 5-8-1995
సుమతి-వెంకట్‌రాంరెడ్డి
చిట్టిగిద్ద -రంగారెడ్డి

పి. భానువంశి
5సం॥. 6-8-1999
సువర్ణ-శ్రీనివాస్
ఫిలింనగర్-హైదరాబాద్

మొహమ్మద్‌జకీయొద్దీన్
1సం॥.7-8-2003
అజ్రానిషాత్-వహీదొద్దీన్
సిద్దిపేట-మెదక్

రాళ్ళబండి అరుణ్‌చంద్
2సం॥. 7-8-2002
అపర్ణ-లింగరాజు
నరసరావుపేట-గుంటూరు

గాండ్ల సోని
9సం॥. 7-8-1995
విజయ-నర్సింలు
షాబాద్-రంగారెడ్డి

ఎ. స్వీటి
స్వరూప-వెంకన్న
ముషీరాబాద్-హైదరాబాద్

ఎల్. స్రవంతి
లక్ష్మి-కేశవులు
మద్దిపాడు-ప్రకాశం

లక్ష్మీ నారాయణ వర్మ
1సం॥2003
శ్రీదేవి-అరుణకుమార్
తొత్మడమూడి- అయిన విల్లి

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



'ఏథెన్స్ టు ఏథెన్స్' బాగుంది

18వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన శీర్షికలన్నీ చాలా ఆసక్తితో చదవాము. ముఖ్యంగా కవర్‌స్టోరీ 'ఏథెన్స్ టు ఏథెన్స్' విశ్లేషణాత్మకంగా కొనసాగింది. గ్రీకురాజధానిలో (ఏథెన్స్) మొట్టమొదటిసారిగా 1896లో జరిగాయని, మళ్ళీ 108 సంవత్సరాల తదనంతరం ఏథెన్స్‌లో (2004) ఒలింపిక్ క్రీడలు జరుగుతున్నాయని తెలిసింది. అయితే ఒలింపిక్ క్రీడలు జరిగిన దేశాలలోనే మళ్ళీ జరిగిన స్థానంలో అమెరికా ముందుందని ఈ వ్యాసం ద్వారా తెలిసింది. భారత్‌లోని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నా, అనుకున్న స్థాయిలో విజయం సాధించడం లేదు. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

-ఎం.డి. ముస్తఖీమ్,
కొల్లాపూర్, మహబూబ్‌నగర్ జిల్లా

విజయనగరం సంగీత విద్యాలయం - ఓ అద్భుత వరం!



18 జులై అనుబంధంలో కళాసాహితి శీర్షికలో విజయనగరం సంగీత కళాశాల ఆవిర్భావానికి ఆద్యుడు అంధబాలుడు చాగంటి గంగబాబు! తెలుగు సాహిత్యం, కళలు, సాంస్కృతి, సంగీత, నాట్య, శిల్పకళా వైభవాలు... ఆదరణ ఖండాంతరాలకు వ్యాప్తి చేసిన ఉదారసేవా భావాల తత్పరుడు విజయరామగజపతి అమరుడు! ఈ కళాశాల పూర్వవిద్యార్థులు ప్రముఖ సినీ గాయని పి.సుశీల, ఘంటసాల వెంకటేశ్వరరావు, సంగీత సామ్రాట్ సాలూరి రాజేశ్వరరావు మొదలైన వారి స్ఫూర్తి నేటి యువగాయనీ గాయకులలో సంగీత సాధకులలో అనేక సాంస్కృతి కార్యక్రమాలలో వీనుల విందు చేస్తున్నవి. విజయనగరం సంగీత కళాశాల అనుబంధ కళాశాలలు కొన్ని మన ఆంధ్రప్రదేశ్‌లో విస్తరింప చేయవలసిన ఆవశ్యకతపై ఆలోచింపవలసిందిగా విద్వాంసులకు, ప్రముఖులకు మనవి.

- జె.సుధాకరరావు,
కొండమ్మవీధి, కాకినాడ.

- కొప్పల కాశీవిశ్వేశ్వరరావు,
కొప్పల వేదవేద్యసూర్యవంశీధర్,
మద్రిపాలెం, విశాఖపట్నం

అనుబంధం ఆకట్టుకుంటోంది

18 జులై ఆదివారం అనుబంధం చాలా బాగుంది. చిన్నారి శీర్షిక అందర్నీ ఆకట్టుకుంటుంది. 'పంచతంత్ర' కథలు చాలా బాగుంటున్నాయి. స్పెషల్ ఆర్టికల్స్ సూపర్, ప్రతీవారం మంచి మంచి ప్రదేశాలను, వాటి విశేషాలను తెలుసుకోగలుగుతున్నాము.

- కోటశ్రీదేవి, శృంగవరపుకోట.

స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వండి

మీరు ప్రచురించిన రుచి కాలమ్ చాలా బాగుంది. ఆకర్షణీయమైన ఫొటోలు, కలం స్నేహం చాలా బాగున్నాయి. దేశ రాజకీయాలు, చరిత్రపై వ్యాసాలు ప్రచురిస్తే చాలా బాగుంటుంది. పత్రికను విద్యార్థులకు ఉపయోగపడేటట్లు స్టడీ మెటీరియల్స్ ప్రచురిస్తే చాలా ఉపయోగంగా ఉంటుంది.

- డి.చంద్రశేఖర్,
సీతంపేట, శ్రీకాకుళం జిల్లా

రియల్ స్టోరీ అద్భుతం

18 జులై 2004 ఆదివారం అనుబంధంలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన వ్యక్తిత్వ కోచ్, ఉన్నతమైన వ్యక్తిగా, అత్యున్నతమైన వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలిచిన శివ్ ఖేరా ఎంతో కష్టపడి రేయింబవళ్ళు శ్రమించి తను చదువుకున్న విద్యకు నిజమైన గుర్తింపును తీసుకురావడం గర్వించదగ్గ విషయం.

- మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా.



మనలో మాట

రాజుగారి చేప కథ....

ఒకటో తరగతి తెలుగు పుస్తకంలో ఒక రాజుగారికి ఏడుగురు కొడుకులు, వారు వేటకెళ్ళి ఏడు చేపలు తేవడం, వాటిని ఎండబెడితే ఒకటి ఎండక పోవడం కథ ఉంటుంది....

ఒక చేప ఎండకపోవడానికి గడ్డిమోపు అడ్డు రావడం... చివరకు చీమల పుట్ట వరకు కథ సాగుతుంది...

ఇపుడా కథ అప్రస్తుతమైనా కొన్ని సంఘటనలు జరిగినపుడు ఇటువంటి కథలు గుర్తుకు రావడం సహజమని విజ్ఞులంటారు!

కొత్త డాక్టర్ కంటే పాత రోగి బెటరని పాత సామెత...

అలాగే కొత్త మంత్రి కంటే మాజీ మంత్రి, కొత్త ఎంఎల్ఏ కంటే మాజీ ఎంఎల్ఏలు గట్టివాళ్ళని నేటి సామెతగా చెప్పుకోవాల్సి వస్తున్నందుకు మనం గర్వించాలి.....

పెద్ద శాఖ మంత్రి మరో చిన్న శాఖ మంత్రి పనుల్లో వేలు పెట్టడం, చిన్న మంత్రి చిన్నబుచ్చుకోవడం.... అనక ముఖ్యమంత్రి ఇద్దరికీ సర్ది చెప్పడం కొద్ది రోజుల క్రితంనాటి వార్త....

మాకు కేటాయించిన ఇళ్ళు మాకు స్వాధీనం చేయండి మహాప్రభో.....అంటూ రెండు నెలల క్రితం వచ్చిన కొత్తమంత్రులు అధికారుల వెంటపడటం తాజా వార్త....

గతంలో మంత్రులుగా ఉండి మాజీలైన వారు ప్రభుత్వ క్వార్టర్లు ఎందుకు ఖాళీ చేయడం లేదు.... కొత్త మంత్రులకు కేటాయించినవి ఎందుకు స్వాధీనం చేయడంలేదంటే రాజుగారి కొడుకుల చేపల కథలా ఉంటుంది....

మా ఇళ్ళు మాకు ఎందుకు స్వాధీనపరచరని మంత్రులు అడిగితే..

మాజీ మంత్రులు ఖాళీ చేయడం లేదని జవాబు.....

మాజీ మాజీ ఎందుకు ఖాళీ చేయడం లేదని అడిగితే...

నేను ఎంఎల్ఏని నాకు కేటాయించిన క్వార్టర్ మాజీ ఎంఎల్ఏ ఖాళీ చేయడం లేదని జవాబు....

ఆ మాజీని.. ఎందుకు ఖాళీ చేయడంలేదని అడిగితే.... ఇల్లు వెతుక్కోవాలి కదా... నాకు తగిన, రక్షణ గల ఇల్లు దొరికినపుడు ఖాళీ చేస్తానని జవాబు...

ఈ తతంగమంతా రాజుగారి చేపల కథలా సాగుతూనే ఉంటుంది.

పాపం కొత్త మంత్రులకు ఈ కథ గుర్తు లేదేమో...

ఈ సంచికలో . . .

ఓరా! . . .	3
కార్టూన్ కదంబం... . . .	4
కవర్ స్టోరీ . . .	6
కథ . . .	9
బాలల కథ . . .	11
బాలనేస్తాలు . . .	12
ఇంతిసంగతులు . . .	16
కచేరి . . .	17
పుస్తక పరిచయం . . .	20
కళాసాహితి . . .	22
న్యాయసలహాలు . . .	24

ఇంకా...

పరిష్కారం

జీవనశైలి ... 10



వెలుగు ప్రదాత

రియల్‌స్టోరీ ... 14, 15



కంటివ్యాధుల నిర్లక్ష్యం - అంధత్వానికి మార్గం

ఆరోగ్యం . . . 18, 19



టూరిస్ట్‌గైడ్ . . . 21

మోడరన్ బకాసురుడు



"తిండిదేముందండీ...ఓ రెండు మెతుకులు, ఓ పచ్చడి బద్ద, ఓ అరచుక్క మజ్జిగ చాలదా" అనేవాళ్ళ మెనూ మన పురాణాల్లోని బకాసురుడుకి ఇస్తే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి. బండెడు అన్నం, ఆ బండికి కట్టిన రెండు దున్నలూ, తోలుకొచ్చిన మనిషినీ'చికెన్ సిక్స్‌టీ కర్రీ' లాగా, 'హైదరాబాదీ దమ్ బిర్యానీ' లాగా టేస్టీగా లాగించే బకాసురుడుకి పైన చెప్పిన మెనూ పంటికిందక్కూడా రాదు. నేటి సైబర్‌యుగ "బకాసుర"సింగ్ దిలీప్ "జెయింట్" సింగ్. ఐదు కోళ్ళు, ఐదు లీటర్ల పాలు, ఇరవైనాలుగు కోడిగుడ్లు, చపాతీల దొంతర, పండ్ల గంప, జ్యూస్ జగ్గు. ఇదండీ... పంజాబ్‌కి చెందిన దిలీప్ 'జెయింట్' సింగ్‌గారి రోజువారీ తిండి. ఈ తిండిసైజుకి తగ్గ సైజులోనే ఉన్న భారీకాయుడు ఈ డి.జె. సింగ్. తిండి తినకముందు ఈయనగారి బరువు నూటపది కేజీలు. ఎత్తు ఏడడుగులకు ఇంకా ఒక అంగుళం ఎక్కువే. ఇంతకీ జెయింట్ సింగ్ ఎవరనుకున్నారు. పంజాబ్ రాష్ట్ర పోలీస్‌శాఖలో సబ్-ఇన్‌స్పెక్టర్. అమెరికాలో కుస్తీ పోటీల శిక్షణ కూడా పొందుతున్నాడు. శిక్షణా సమయంలోనే 200 ఛాంపియన్‌షిప్‌లు గెలుచుకున్నాడు.



ఇడ్లీ యంత్రం...!

ఈ ఫోటోలో కనిపిస్తున్న యంత్రాన్ని చూస్తే ఏమనిపిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల వారు ఇష్టంగా తినే ఇడ్లీలు చిటికెలో వేలకొద్దీ తయారుచేసి గుట్టగా పోసే యంత్రమది... పెద్ద హోటళ్ళలో రద్దీ సమయాల్లో ఇడ్లీలు సరఫరా చేయలేక చాలా ఇబ్బంది పడుతుంటారు. ఇటువంటి వారి కోసం మైసూర్ లోని సెంట్రల్ ఫుడ్ టెక్నొలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఒక అద్భుత యంత్రాన్ని తయారు చేసింది. అంతేకాదు నిమిషంలో డజన్ల కొద్దీ దోసెలు తయారు చేసే మరో యంత్రం కూడా తయారుచేశారు. చిత్రంలో కనిపిస్తున్న ఆ భారీ యంత్రంలో ఒక చివర ఇడ్లీలకు సంబంధించిన ముడిపదార్థాలు వేస్తే అదే పిండి రుబ్బుకుని ఇడ్లీలను తయారు చేసి ఈ చివరకు తెచ్చి గుట్టగా పోసేస్తుందట! విచిత్రంగా లేదూ?! వీటి రుచి కూడా అమోఘంగా ఉందట! అంతేగాక దీనివల్ల ఇంధనం కూడా చాలా ఆదా అవుతుందట. మంచిదేగా!?

భారీ పోటీ



మిస్ ఇండియా, మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్ పోటీలు ఏటా జరుగుతుంటాయి.. అందంగా నాజూగ్గా ఉండేవారు, తెలివైన వారూ ఈ పోటీల్లో కిరీటాలు దక్కించుకుంటారు. అందాల పోటీలు మొదలైన తర్వాత యువతుల్లో నాజూకుతనం ఎక్కువై అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారని ఇటలీలోని ఒక నగర ప్రభుత్వం భావించింది. ఆ వెంటనే ఎక్కువ బరువున్న మహిళలకు బహుమతి ఇస్తామని ప్రకటించింది. అంతేగాదు పోటీ కూడా నిర్వహించింది. ఎక్కువ బరువుండి ఆరోగ్యవంతురాలైన, తెలివైన మహిళను ఎంపిక చేసి కిరీటం కూడా ఇచ్చింది. 240 పౌండ్ల బరువున్న ఒక మహిళకు ఈ కిరీటం దక్కింది. మహిళల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించడానికే ఈ పోటీలు నిర్వహించామని నిర్వాహకులు ప్రకటించారు!?

కార్టూన్ కదంబం


కృత్రిమ వర్షాలు


విందులో ఏంపెట్టాడో గానీ ప్రత్యేక రాష్ట్రం గురించి ఆయన చెప్పింది విని విని...
కెసిఆర్
కెసిఆర్ విందు సమావేశాలు
నారు


బడా పారిశ్రామిక వేత్తలు
లాభాలు
విలీనం
చిదంబరం
ఓరియంటల్ బ్యాంక్

థ్యాంక్సు వివేకానందవారికి, ఇప్పుడు సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి ఉద్యోగం దొరికింది.



ఇంట్లోవుంటూ ప్రతిరోజు మీ తీరిక సమయంలో ఒక గంట మాత్రం కేటాయించి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగు కోర్సు 60 రోజులలో చదివి మీరు కూడా అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడటం ప్రారంభించండి.

ఉద్యోగం కోసం ఇంటర్‌వ్యూలు, ఈ-మెయిల్ ద్వారా సంప్రదింపులు, విదేశాలలో ఉన్నత పదవులు ఇలా అన్ని రంగాలలో రాణించటానికి వివేకానంద వారి శిక్షణ ద్వారా ఇప్పటికే 23 లక్షలకు పైబడినవారు ప్రయోజనం పొందివున్నారు. ఈ ప్రయోజనాన్ని మీరు కూడా పొందంటానికి క్రిందవున్న కూపను పూర్తిచేసి ఈ రోజే పంపండి. పాఠాలు **VPP** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి.

Yes! నేనూ ఇంగ్లీషులో సరళంగా మాట్లాడాలనుకుంటున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా పంపండి. పోస్టుమేన్‌కి రూ. **575/-** చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

పేరు: ....

వయసు: .... ఆడ ☐ మగ ☐

చిరునామా: ....

....

.... పిన్‌కోడ్ ....

PS-01

VIVEKANANDA INSTITUTE

9, Madley Road, T. Nagar, Chennai-600017.

రండి! ఇంగ్లీషులో మాట్లాడుదాం

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: **HYDERABAD:** (S.R.NAGAR ☎ 23714330. DILSUKHNAGAR ☎ 24044352. VANASTHALIPURAM ☎ 24122464. MEHDIPATNAM ☎ 55755888. A.S.RAO NAGAR ☎ 55497992. NARAYANAGUDA ☎ 55155441). RAJAMUNDRY ☎ 2422003. KAKINADA ☎ 2386638. VISAKHAPATNAM ☎ 2738892. VIJAYAWADA ☎ 5530053. GUNTUR ☎ 2238541. NELLORE ☎ 2327702. THIRUPATI ☎ 2252878. CUDDAPAH ☎ 224445. MIRYALGUDA ☎ 230130. ANANTAPUR ☎ 241029. KURNOOL ☎ 248099. NIZAMABAD ☎ 235767. PRODDATUR ☎ 250550.

08/TEL/04/NAGA

కాలంతో పోటీ.. బుల్లెట్ రైళ్లు...



[illegible] ఉండాల్సిన అవసరం ఏర్పడకపోవచ్చు... [illegible]పురంలో ఉన్న వారు గంట [illegible] హైదరాబాద్ వచ్చి కూరగాయలు కొనుక్కుపోవచ్చు. హైదరాబాద్ వాసులు మరో గంట సమయంలో కర్నూలు వెళ్లి ఉల్లిపాయలు కొనుక్కురావచ్చు. రాజకీయ నాయకులు రోజుకు రెండుసార్లు రాష్ట్రం అంతా చుట్టి రావచ్చు... అత్యవసర చికిత్స అవసరమైనవారు ఎంత దూరంలో ఉన్నా నిమిషాల్లో నగరాల్లోని ఆస్పత్రులకు వచ్చేయొచ్చు...

ఏమిటీ... ఆశ్చర్య పోతున్నారా....! ఫాస్ట్ ట్రాక్‌ల శకం మొదలై హైస్పీడు రైళ్లు పూర్తిగా అందుబాటులోకి వస్తే పైవన్నీ సాధ్యమే. ఉద్యోగులు, వ్యాపారస్థులు, విద్యార్థులు, రాజకీయ నాయకులు, ఆఫీసులకు వెళ్లేవారు, వైద్య అవసరాలు, అత్యవసర పనులు... ఇలా ఎవరైనా సరే పొద్దునే బయల్దేరి 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న గమ్యస్థానం చేరుకొని అక్కడ తమ పనులు చక్కబెట్టుకొని సాయంత్రానికి సొంత ఊరు చేరుకోవచ్చు. ఈ ఊహే ఇంత మధురంగా ఉంటే వాస్తవం ఎంత మజాగా ఉంటుందో కదా!

ఎర్రవల్లి జాషువా

ఇప్పటికిప్పుడు కాకున్నా హైస్పీడ్ రైళ్లు మన దేశంలో కూడా పరుగులు తీసే అవకాశం ఉంది. మన రైల్వే వ్యవస్థ హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రయత్నాలు సఫలీకృతమైతే కొద్ది సంవత్సరాల్లోనే మన దేశంలోనూ హైస్పీడు రైళ్లు పట్టాలెక్కుతాయి. ఈ రైళ్ళ గురించి వినడమే మనకు కొత్త కావచ్చు కాని, జపాన్, ఫ్రాన్స్ దేశాల్లో అనునిత్యం పరుగులు తీసేవి ఇలాంటి రైళ్లే. అక్కడి రైల్వే వ్యవస్థ వారి ఆర్థిక రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది.

ట్రాఫిక్ సమస్య, కార్ల ప్రయాణంలో ఇబ్బందులను జపాన్ మొదట గుర్తించింది. రద్దీగా ఉండే రాజధాని టోక్యో నగరం, అత్యంత జనసాంద్రత గల దేశంలో మోటారు వాహనాల ప్రయాణంలో ఉన్న ఇబ్బందులకు ప్రత్యామ్నాయం కనుగొనాలని నిర్ణయించింది. తత్ఫలితమే బుల్లెట్ రైళ్ళ ఆవిష్కరణ. ప్రపంచంలోనే అత్యంత వేగంగా నడిచిన మొదటి హైస్పీడ్ రైలుగా ఈ బుల్లెట్ ట్రైన్‌ను చెప్పుకోవచ్చు. 1964లో తమదేశంలో తొలిసారి ఒలింపిక్ పోటీలను నిర్వహించిన సందర్భంలో జపాన్ ఈ రైలును ప్రవేశపెట్టింది. అప్పట్లోనే దీని వేగం గంటకు 210 కిలోమీటర్లు. అమెరికా సహా అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఇటువంటి రైళ్లు ఇప్పటికీ లేవు. జపాన్ తరువాత హైస్పీడ్ రైళ్లు ఐరోపాలో ప్రవేశించాయి. జపాన్ బుల్లెట్ ట్రైన్ వ్యవస్థే నేటి హైస్పీడు రైళ్ల ప్రవేశానికి స్ఫూర్తి. భద్రత, వేగం, క్రమశిక్షణ వంటి అంశాల్లో జపాన్ రైల్వేలు ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకుంటున్నాయి. 1964 నుండి ఇంత వరకూ జపాన్‌లో ప్రయాణీకుల పొరపాట్ల వల్ల తప్ప ఈ బుల్లెట్ ట్రైన్‌లలో ఒక్క ప్రమాదం కూడా సంభవించలేదట. ఇక వేగానికి సంబంధించి ప్రపంచ రికార్డును జపాన్ సొంతం చేసుకుంది. హైస్పీడు రైలు సగటు వేగం గంటకు 261.8 కిలోమీటర్లు. తాజాగా 'నాజోమీ' సిరీస్‌లో వచ్చిన రైళ్లు 300 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీస్తున్నాయి. షిన్-ఒసాకా, హకాతా నగరాల మధ్య ఈ రైళ్లను 1997 మార్చిలో జపాన్ ప్రవేశపెట్టింది. గత డిసెంబరులో జపాన్‌కు చెందిన మాగ్లేవ్ రైలు 581 కి.మీ వేగంతో ప్రయాణించి ప్రపంచ రికార్డు సృష్టించింది. పైగా 1999లో తానే సృష్టించిన 552 కి.మీ. గిన్నీస్ రికార్డును ఇది అధిగమించింది.

ఇక రైళ్ల రాకపోకల వేళలకు సంబంధించి జపాన్ రైల్వేలు క్రమశిక్షణను కచ్చితంగా పాటిస్తాయి. వందలాది కిలోమీటర్లు దూరం ప్రయాణించే రైళ్లు తమ గమ్యస్థానానికి నిర్ణీత సమయంలో కచ్చితంగా చేరుకుంటాయి. బహు అరుదుగా జరిగే ఆలస్యం కేవలం క్షణాలలో ఉంటుందంటే ఆశ్చర్యపోకండి. ఒక సంవత్సర కాలంలో సగటున జపాన్‌లోని అన్ని రైళ్లు ఆలస్యంగా నడిచేది కేవలం 12 సెకండ్లే.

హిరోషిమా, కోకురా నగరాల మధ్య నడుస్తున్న బుల్లెట్ ట్రైన్‌ను ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన రైలుగా గుర్తించారు. ఈ రెండు నగరాల మధ్య ఉన్న 192కిలోమీటర్ల దూరాన్ని ఈ రైలు కేవలం 44 నిమిషాల్లో అధిగమిస్తుంది. దీని సగటు వేగం గంటకు 262 కిలోమీటర్లు.



వివిధ దేశాల్లో హైస్పీడు రైళ్లు వాటి వేగం



ఫ్రాన్స్ : 1989 నుండి ఫ్రాన్స్ వందలాది టీజీవి రైళ్లను నడుపుతోంది. వీటి వేగం సగటున 260 కి.మీ.

జపాన్ : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 'షింకన్సేన్' సూపర్ బుల్లెట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను జపాన్ ఇటీవల ప్రవేశ పెట్టింది. ఇవి గంటకు 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలవు. వీటిని 1996లో ప్రవేశపెట్టారు.

స్పెయిన్ : ఫ్రాన్స్‌కు చెందిన టీజీవి సంస్థ నిర్మించిన ఎవిఇ రైళ్లను స్పెయిన్‌లో నడుపుతున్నారు. వీటి వేగం కూడా గంటకు 300 కి.మీ.

జర్మనీ : 1999 నుండి హైస్పీడ్ రైళ్లు నడుస్తున్నాయి. అయితే గంటకు 330 కి.మీ. వేగంతో నడిచే ఐసిఇ రైళ్లను ప్రవేశపెట్టేందుకు జర్మనీ ప్రణాళికలు రూపొందిస్తోంది.

గ్రేట్ బ్రిటన్ : గత సంవత్సరమే హైస్పీడ్ రైలు లింక్ పూర్తయింది. వీటిపై దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను 300 కి.మీ. వేగంతో యూరోస్టార్ (రైల్వే) నడుపుతోంది. లోకల్ రైళ్ల స్థాయిలో ఈ వేగంతో నడిచే రైళ్లను ప్రవేశపెట్టే యోచన ప్రస్తుతం యూరోస్టార్‌కు లేదు.

రష్యా : సెయింట్ పీటర్స్‌బర్గ్ నుండి మాస్కో మధ్య గంటకు 250 కిలోమీటర్ల వేగంతో రైళ్లు నడుస్తున్నాయి. మాస్కో, వ్లాదివోస్తోక్ మధ్య నడిచే ట్రాన్స్ - సైబీరియన్ ఎక్స్‌ప్రెస్ ప్రపంచంలోనే ఎక్కువ దూరం ప్రయాణించే రైలు. ఇది మొత్తం తొమ్మిది రోజుల పాటు సుమారు 8,700 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ మధ్యలో 91 చోట్ల ఆగుతుంది.

అమెరికా : ఫ్రాన్స్‌కు చెందిన టీజీవి సంస్థ నుండి కొనుగోలు చేసిన రైళ్లను అమెరికా వివిధ ప్రాంతాలలో నడుపుతోంది.

వేగాన్ని, రైల్వే స్టేషన్లలో ఆగే పరిమితిని బట్టి రైళ్లను మూడు విభాగాలుగా విభజించారు.

నొజోమి : నొజోమి రైళ్లు ముఖ్యమైన స్టేషన్లలో మాత్రమే ఆగుతాయి. ఒసాకా - టోక్యో నగరాల మధ్య నడిచే ఈ రైలు 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య ఉన్న 560 కిలోమీటర్ల దూరాన్ని ఇది రెండున్నర గంటల్లో చేరుకుంటుంది. ప్రతినిత్యం మూడు లక్షల మంది టోక్యో నుంచి ఒసాకాకు వస్తూ పోతుంటారు.

హికారి : హికారీ రైళ్లు నొజోమీ రైళ్ల కన్నా కొంచెం ఎక్కువ స్టేషన్లలో ఆగుతుంది. ఇది మూడు గంటల వ్యవధిలో ఒసాకా నుండి టోక్యో చేరుకుంటుంది.

కొడామా : కొడామా రైళ్లు అన్ని స్టేషన్లలో ఆగుతాయి. దీని వేగం గంటకు 200 కిలోమీటర్లు.

ఈ విధంగా జపాన్ వెయ్యికి పైగా బుల్లెట్ రైళ్లను పలు రూట్లలో నడుపుతోంది.

ఉదాహరణకు

- టొకైడో లైన్ సిరీస్‌లో 1992 నాటి నుండి 300 రైళ్లను గంటకు 270 కిలోమీటర్ల వేగంతో ఆపరేట్ చేస్తున్నారు.

సాన్యో లైన్ సిరీస్‌లో 1997 నుండి 500 రైళ్లు అత్యంత వేగంగా అంటే గంటకు 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాయి.

తొహోకు లైన్ సిరీస్‌లో 1997లో ప్రవేశపెట్టిన '200 ఇ2-ఇ3' రైళ్లను ఆపరేట్ చేస్తున్నారు. వీటి వేగం గంటకు 275 కిలోమీటర్లు.

జొయెత్సు లైన్ సిరీస్‌లో రెండు వందల 'ఎఫ్9×' రైళ్లు 275కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాయి.

ఫాస్ట్ ట్రైన్‌ల సగటు వేగం ప్రస్తుతం గంటకు 300 కిలోమీటర్లుగా ఉంది. వీటి వేగమే వాటి ప్రాముఖ్యతకు కారణం. ప్రజలు తమ ప్రయాణాలకు రైళ్లను ఎంచుకోవడానికి కూడా వాటి వేగమే కారణం. కారులో ప్రయాణం కన్నా కొన్ని రెట్ల అధిక వేగంతో రైలులో తమ గమ్యానికి చేరుకోవచ్చు.

ఫాస్ట్‌ట్రైన్‌ల కోసం అమెరికాలో ప్రణాళికలు

అమెరికాలో కూడా హైస్పీడు రైళ్లు నడుస్తున్నాయి. ఫ్రెంచ్ టీజీవి రైళ్లను కొనుగోలు చేసి అభివృద్ధి పరచాలని ఆమ్‌ట్రాక్ సంస్థ సంప్రదింపులు జరుపుతోంది. ఎప్పుడూ వింత చేష్టలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించే కాలిఫోర్నియా వాసులకు బుల్లెట్ ట్రైన్‌ను నడపాలన్నది తాజా కోరిక. శాన్‌డీగో, లాస్ ఏంజిల్స్, శాన్‌ఫ్రాన్సిస్కోల మధ్య 700 మైళ్ల పొడవున బుల్లెట్ ట్రాక్‌ను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి 3700 కోట్ల డాలర్లు ఖర్చవుతుంది. దీనిలో మొదటి దశ ప్రాజెక్టుకు ఖర్చయ్యే వెయ్యికోట్ల డాలర్లపై అనుమతి పొందేందుకు ఈ నవంబర్‌లో ఓటింగ్ జరగనుంది. దీనికి అనుమతి లభించకపోవచ్చని భావిస్తున్నారు. అయితే 2020 సంవత్సరం వరకూ రవాణాపై ప్రభుత్వం వెచ్చించే వ్యయం కంటే ఈ రైలు ప్రాజెక్టు ఖర్చు సగానికన్నా తక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. 2020 నాటికి పెరిగే జనాభా అవసరాలకు అనుగుణంగా కార్లు లేదా విమానాల కోసం 8200 కోట్ల డాలర్లు ఖర్చవుతాయి. వీరి కోసం కొత్తగా 2,970 మైళ్ల పొడవైన కొత్త రహదారులను నిర్మించాలి. విమానాశ్రయాలలో 60 కొత్త గేట్లను, ఐదు కొత్త రన్‌వేలను నిర్మించాల్సి ఉంటుందని నిపుణులు అంచనా వేశారు. దీనికన్నా ఒక్క హైస్పీడు రైలు మార్గాన్ని నిర్మిస్తే 2020 నాటికి పెరిగే జనాభా యొక్క రవాణా అవసరాలను పూర్తిగా తీర్చవచ్చన్నది వీరి వాదన. అయితే రైలు మార్గాన్ని నిర్మించేందుకు అవసరమైన భూభాగం అత్యధికంగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నందున ఆటంకాలు ఎదురుకావచ్చని అధికారులు భావిస్తున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో నుండి లాస్ ఏంజిల్స్ మధ్య విమాన ప్రయాణం 1.20 గంటలు కాగా అదే స్పీడ్ ట్రైన్‌లో అయితే 2.25 గంటలు పడుతుంది.



రైళ్లను అయస్కాంతాల సాయంతో నడపాలన్న ఆలోచన సుమారు 80 ఏళ్ల కిందటే హెర్మన్ కెంపర్ అనే జర్మనీ ఇంజనీరుకు వచ్చింది. అప్పట్లో హెర్మన్ 'ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ లెవిటేషన్' నమూనాను ప్రదర్శించి దానికి సంబంధించిన పేటెంట్ హక్కులను కూడా పొందాడు. ప్రస్తుతం మాగ్లేవ్‌గా వ్యవహరిస్తున్న అయస్కాంత రైళ్లు పట్టాలకు పది మిల్లీమీటర్ల ఎగువన ప్రయాణిస్తాయి. గంటకు 330 కిలోమీటర్ల వేగంతో, 700 మంది ప్రయాణీకులను ఈ రైళ్లు మోసుకుపోగలవు. ఈ యూరో స్టార్ రైళ్లలో ఉన్న

భారత్ రైళ్ళ పరుగులు

- [illegible]
- [illegible] 16 లక్షల [illegible] పని చేస్తున్నారు. అనునిత్యం 13,000 రైళ్లు, 1.5 కోట్ల మంది ప్రయాణీకులను, పది లక్షల టన్నులకు పైగా సరుకును ఏడువేల స్టేషన్ల నుండి రవాణా చేస్తుంటాయి.
- 1819లో ఫస్ట్ క్లాస్ బోగీల్లో టాయిలెట్లను ప్రవేశపెట్టగా, 1907లో వీటిని దిగువ తరగతి కూపేలకూ విస్తరించారు.
- దేశంలో తొలి ఎలక్ట్రిక్ రైలు 1925, ఫిబ్రవరి మూడున ముంబయి వి.టి., కుర్లాల మధ్య నడిచింది.

- దేశంలో స్టీమ్ ఇంజన్ల (ఆవిరి యంత్రాల) తయారీని 1972లో నిలిపివేశారు.
- సుదూరం ప్రయాణించే రైలు హిమసాగర్ ఎక్స్‌ప్రెస్. ఇది జమ్మూ తావీ నుంచి కన్యాకుమారి దాకా 3,751 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ప్రయాణ వ్యవధి సుమారు 66 గంటలు.
- ప్రపంచంలోనే అత్యంత పొడవైన రైల్వే ప్లాట్‌ఫామ్ ఖరగ్‌పూర్‌లో ఉంది. దీని పొడవు 2,733 అడుగులు.
- సోనే నదిపై నిర్మించిన నెహ్రూ సేతు దేశంలోనే అతి పొడవైన రైల్వే వంతెన.
- అతి పొడవైన సొరంగ మార్గం కొంకణ్ రైల్వే పరిధిలో ఉంది. దీని పొడవు 6.5 కిలోమీటర్లు.
- దేశంలో కలకత్తా మెట్రో తొలి ఏకైక భూగర్భ రైల్వే.
- కిందటేడాది ఏప్రిల్- డిసెంబర్ నెలల మధ్య భారతీయ రైల్వేలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో 407.15 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేశాయి.
- ఇటీవలే విజయవాడ-నర్సాపురం మధ్య కొత్తగా ఏరోడైనమిక్ రైలును ప్రవేశపెట్టారు.

రెండు మోటార్లు 12,200 కిలోవాట్ల శక్తితో పని చేస్తాయి.

ప్రధానంగా వ్యవసాయక దేశమైన భారత్‌లో చుట్టపు చూపుకు వెళ్లేవారు, టూరిస్టులు తప్ప దూరపు ప్రాంతాలకు వెళ్లే ప్రయణీకులు రైళ్లలో ఎక్కరు. ఉద్యోగరీత్యా ఆఫీసు పనుల మీద వెళ్లే వారు, వ్యాపారులు కూడా అప్పుడప్పుడు రైలు ప్రయాణాలు చేస్తుంటారు. ముంబయి, చెన్నయ్, ఢిల్లీ, కోల్‌కతా వంటి మెట్రో నగరాలలో తప్ప ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు రోజూ రైళ్లను ఎక్కడం అరుదు. అదీ అక్కడి లోకల్ రైళ్లు 50-60 కిలోమీటర్ల పరిధిలో నడిచేవే. కానీ దూర ప్రాంతాల నుండి విధుల నిమిత్తం నగరాలకు రైళ్లలో వచ్చే వారు ఉండకపోవచ్చు. హైదరాబాద్ వంటి నగరాలలో ఉద్యోగాలు చేసే ఇతర ప్రాంతాల వారు ఇక్కడే అద్దె ఇళ్లలో ఉంటున్నారు. అలా కాకుండా 500 కిలోమీటర్ల దూరంలోని తమ స్థానిక నివాసాల నుండే పని చేసే ప్రదేశానికి నిర్ణీత సమయంలో చేరుకోవాలనుకొనే వారికి ఫాస్ట్ ట్రైన్‌లు ఉపయోగపడతాయి. ట్రాఫిక్ బెడద తప్పుతుంది. వాయు కాలుష్యాన్నీ నివారించవచ్చు. అయితే ఎప్పుడో బ్రిటీష వారు వేసిన రైల్వే లైన్లపైనే రైళ్లను నడుపుతున్న మనం ఫాస్ట్ ట్రైన్‌లు నడపాలంటే దానికవసరమైన ఫాస్ట్‌ట్రాక్‌లను నిర్మించాల్సి ఉంటుంది. అది ఎంతో వ్యయంతో కూడుకున్న పని. వేలకోట్ల రూపాయలు ఖర్చవుతాయి. ఆ ఖర్చును తట్టుకునే స్థితి మన ఆర్థిక వ్యవస్థకు లేదు. అయితే దేశం పారిశ్రామికాభివృద్ధిలో ఉన్నత స్థితికి చేరుకోంటే ఫాస్ట్ ట్రాక్‌లను నిర్మించటం పెద్ద పని కాదు. కానీ పారిశ్రామికాభివృద్ధి జరగాలంటే ప్రజలలో కొనుగోలు శక్తి పెరగాలి. అందుకు మిగులు భూమి పంపకం జరగాలి. ❖



ఫ్రాన్స్‌లో టిజివి రైళ్లు

జపాన్ తరువాత హైస్పీడ్ రైళ్లను పరుగులు తీస్తున్న దేశాల్లో ఫ్రాన్స్ రెండవది. ముఖ్యంగా రైలు రవాణా పరిజ్ఞానంలో ఫ్రాన్స్‌ది .అందెవేసిన చేయి. అత్యంత వేగవంతమైన టిజివి రైళ్లు అక్కడ గంటకు 300 కి.మీ. వేగంతో పరుగులు తీస్తుంటాయి. టీజీవి రైళ్లను ఫ్రాన్స్‌లో తొలిసారిగా 1970 దశకంలో ప్రవేశపెట్టారు. టీజీవి రైలు 1972 డిసెంబరు 8న గంటకు 318 కి.మీ. వేగాన్ని నమోదు చేసింది. 1990 మే 18న టీజీవి అట్లాంటిక్ గంటకు 515.3 కి.మీ వేగంతో ప్రయాణించి రికార్డు సృష్టించింది. ప్యారిస్‌లో వివిధ స్టేషన్ల నడుమ కొద్ది నిమిషాలకోసారి టీజీవీలు పరుగులు తీస్తుంటాయి. క్రిస్మస్ వస్తే అమెరికాలోని విమానాశ్రయాల కన్నా ప్యారిస్ రైల్వే స్టేషన్లలోనే రద్దీ ఎక్కువగా ఉంటుంది. టీజీవీలు వేగంగా ప్రయాణించడమే కాక వీటిలో రేటు కూడా తక్కువ. పైగా కచ్చితమైన సమయాన్ని పాటిస్తాయి.

చైనాలో మ్యాగ్నెటిక్ లెవటేసన్ రైలు కిందటేడాది జనవరిలో షాంఘైలో పట్టాలెక్కింది. ఈ రైలును పరీక్షించినప్పుడు దీని వేగం గంటకు 500 కి.మీ. షాంఘై - బీజింగ్ నగరాల మధ్య (1280 కిలోమీటర్ల దూరం) హైస్పీడు రైలును ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఆడపిల్ల

కె.సీతారాములు

(గతవారం తరువాయి)

శ్రీధర్ ఆలోచనల్నుండి తేరుకుంటుండగానే శ్రీలక్ష్మి స్పృహలోకొచ్చింది. "నాకు న్యాయం చేయండి" అంటూ బెడ్‌మీంచి లేవ్వన్నది. అక్కడున్న నర్సులు పడుకోబెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. శ్రీలక్ష్మి తన శక్తిని కూడదీసుకొని అరిచి కేకలు పెడుతూ బయటకు వచ్చింది.

వెంటనే శ్రీధర్ అడ్డుకొని ఆపాడు.

"నీకు మగబిడ్డ పుట్టాడు లక్ష్మి, స్కానింగ్‌లో రిపోర్టు తప్పువచ్చిందట! నేను అక్కడి డాక్టర్ వద్దకెళ్ళి మళ్ళీ తెలుసుకొని వచ్చాను, మనకు మంచే జరిగింది గోల చేయకు" అంటూ భార్యను సముదాయించాడు

"లేదు మీరు, డాక్టరు కలిసి నన్ను మోసం చేస్తున్నారు. స్కానింగ్ రిపోర్టు తప్పుకాదు, స్వయంగా నేనూ చూసాను కదా అది ఖచ్చితంగా ఆడపిల్లే...నాకు ఆడ బిడ్డే పుట్టింది...నాబిడ్డ నాకుకావాలి" అంటూ ఏడుస్తూ గోలపెడుతోంది శ్రీలక్ష్మి.

అప్పటికే జరుగుతున్న గోలకు ఏం జరిగిందో తెలుసుకుందామని ఒకొక్కరు గుంపుగా చేరారు.

"నువ్విలా అరిచి గొడవ చెయ్యకు..నీకు మగ పిల్లాడే పుట్టాడు" అంటూ వారిస్తున్నాడు శ్రీధర్ విసుగ్గా

"నాకు ఆడబిడ్డే పుట్టింది, నన్ను మోసం చేస్తున్నారు, మీరంతా నాకు న్యాయం చెయ్యండి" అంటూ భర్త చేతుల్ని విదిలించుకొని హాస్పిటల్ వరండాలోకి వచ్చింది శ్రీలక్ష్మి. "మీరయినా సహకరించి నా బిడ్డను నాకు ఇప్పించండి" అంటూ అక్కడికి చేరుకున్నోళ్ళకు మొరపెట్టుకుంది.

బయటకు వెళ్ళిన శ్రీలక్ష్మి తల్లి, అన్నయ్య అప్పుడే వచ్చారు. వాళ్ళకేమీ అర్థం కావడంలేదు. ఆమె పరిస్థితి చూసి ఆందోళన పడుతున్నారు, ఓదారుస్తూ అడుగుతున్నారు.

"నాకు పుట్టిన బిడ్డను ఎవరికో ఇచ్చి ఎవరికో పుట్టిన మగబిడ్డను నాకు ఇస్తున్నారమ్మా!" అంటూ తల్లిమీద పడి ఏడుస్తూ నీరసంతో కూలబడ్డది శ్రీలక్ష్మి.

"ఇదెక్కడి అన్యాయమే తల్లీ! ఈ డాక్టర్లు నాశనంగాను, ఈ దవాఖాన పాడుగాను" అంటూ తల్లి శావనార్థాలతో మొత్తుకుంటూ పెద్దగా ఏడుపులంకించుకుంది.

"మీ అల్లుడే ఈ పని చేయించాడమ్మా! అతనికి ఆడపిల్లలంటే అసలే గిట్టదు. డాక్టర్‌కు లంచం ఇచ్చి ఈ విధంగా చేయించి ఉంటాడు" అంటూ విలపిస్తూనే చెప్పింది శ్రీలక్ష్మి.

ఈ గొడవతో ధవాఖానలోని జనం సిబ్బంది మొత్తం ఒక్క చోటుకు చేరుకున్నారు, ఈలోగా లక్ష్మయ్య విషయాన్ని సమస్యను దావానలంలా వ్యాపింపచేసాడు.

పెద్ద మనుషులు, పార్టీల వాళ్ళు అక్కడికి చేరుకొని విషయం తెలుసుకుంటున్నారు. రాజకీయ పక్షాలు, సామాజిక సంస్థల వాళ్ళు హాస్పటల్ పనితీరుపై మండిపడుతున్నారు.

కాన్పుకు వచ్చిన కంసలిని పిలిపించాడు డాక్టర్ దేవానందం

"నీకు మగ బిడ్డ పుట్టినట్లుగాని, దాన్ని మాకు ఇచ్చినట్లుగాని ఎట్టి పరిస్థితిలో ఈ రహస్యం ఎవ్వరికి చెప్పొద్దు. ఇవిగో నువ్వడిగిన రెండువేల రూపాయలు జాగ్రత్తగా వెళ్ళిపో" అంటూ ఆమెకు డబ్బు ఇచ్చి డిశ్చార్జి చేసి పంపించాడు.

పెళ్ళి చేసుకుంటానని చెప్పి గర్భవతిని చేసి ఒక వంచకుడి వంచనకు గురయిన కంసలి అనాధగా మారిపోయింది, కడుపు నింపుకోవడంకోసం పడుపు వృత్తిలోకి దిగింది. సమాజంలో తలెత్తుకొని బ్రతకలేని తను బిడ్డనుకని ఎలా బ్రతకగలనని కంసలి కడుపుతీయించుకోడానికి హాస్పిటల్‌కు వచ్చింది. ఆమె బలహీనతను ఆసరా చేసుకొని ఈ విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు డాక్టరు

కంసలి వెళ్ళిపోగానే శంకరరావు అతని భార్య వచ్చారు డాక్టరు వద్దకు.

"ఏమయింది డాక్టర్! మీరు అడిగినట్లుగానే మీకు యాభైవేలు ఇచ్చి నెలరోజులయింది, ఆడపిల్లను ఇస్తానని ఇంతవరకు ఇవ్వలేదు" అంటూ కోపం ప్రదర్శించాడు శంకరరావు.

"ఉష్... అలా అరవకండి, ఇప్పటికే బయట గోలయిపోతోంది" అంటూ బెల్ కొట్టి సిస్టర్ నర్సమ్మను పిలిచాడు.

"ఆ ఆడపిల్లను తీసుకురా" అని చెప్పాడు.

సిస్టర్ వెంటనే వెళ్ళి రహస్యంగా దాచి ఉంచిన శ్రీలక్ష్మికి పుట్టిన బిడ్డను తీసుకొచ్చింది.

"ఇదిగో తీసుకో. ఈ పిల్లను తీసుకుపో. ఎవరికీ తెలియనీయకండి" అంటూ పసిబిడ్డను ఇచ్చి జాగ్రత్తలు చెప్పాడు డాక్టర్

బిడ్డను చూసుకున్నారు ఇద్దరు.

"పండంటి బిడ్డను ఇచ్చావ్, ఇంకా మాకు పదిమంది బిడ్డలు కావాలి, మొత్తం పదిమందిని జమ చేసుకొని పంపించాలి, మళ్ళా ఎప్పుడు పిల్లనిస్తారో ఫోను చేయండి..చాలా సంతోషం వెళ్ళొస్తాం" అంటూ శంకరరావు అతని భార్య వెళ్ళిపోయారు.

ఇలాంటి సందర్భాలలో సిస్టర్ నర్సమ్మకు, వార్డు బాయ్‌లకు పైసలిస్తూ తన గుప్పిట్లో పెట్టుకొని ఈ వ్యాపారం సాగిస్తున్నాడు డాక్టర్ దేవానందం. శంకరరావు లాంటి వాళ్ళతో సంబంధం పెట్టుకొని కాన్పులకు వస్తున్న తల్లులను మోసం చేస్తున్నాడు డాక్టర్. వైద్యసేవ ముసుగులో అక్రమ సంపాదనకు పాల్పడుతున్నాడు ఇలాంటి వాళ్ళను ఆసరాచేసుకొని పసి బిడ్డల్ని కొని ఆటబొమ్మలుగా చేస్తూ లక్షలు కోట్ల వ్యాపారం చేసుకుంటున్నారు.

"ఒకే దెబ్బకు రెండుపిట్టలు" అన్నట్లు ఒకే ప్రయత్నంలో రెండు వైపులా డబ్బులు రావడం అదృష్టంగా భావిస్తున్నాడు డాక్టర్. ఆడపిల్ల పుడుతుందని ఒక అనాథ స్త్రీ కాన్పుకురావడం కలిసొచ్చింది. తన భార్యకు ఆడబిడ్డ పుడితే ఆ స్థానంలో మగబిడ్డను ఇవ్వాలని ఒక తండ్రి రావటం అదృష్టమయింది. ఈ రకంగా శంకరరావుకు ఒప్పందం ప్రకారం ఆడపిల్లను అందివ్వడం సులువైందని డాక్టర్ సంతోషిస్తున్నాడు...కాని బయట జరుగుతున్న గొడవకు కొంత భయపడుతున్నాడు.

"నువ్వు గొడవ ఆపకపోతే నేను నీకు విడాకులిస్తాను" అంటూ శ్రీలక్ష్మిని బెదిరించాడు శ్రీధర్.

"ఎందుకండీ మీరిలా ప్రవర్తిస్తున్నారు? ఆడదంటే చులకనతోనే కదా? ఎందుకు నా నోరు మూయించాలని చూస్తున్నారు? కాని నేను ఈ విషయంలో మాత్రం రాజీపడదల్చుకోలేదు. ఆడపిల్లను కన్న తల్లిగా, మీకు భార్యగా నా హక్కును నాకు ప్రసాదించండి" అంటూ భర్తను వేడుకుంటున్నది శ్రీలక్ష్మి.

"భార్యా భర్తలన్నపుడు భర్త చెప్పేమాట వేదం నీకు మగబిడ్డ పుట్టింది. నేను చెప్పినట్లు విని మర్యాదగా ఆ బిడ్డను తీసుకొని ఇంటికొచ్చేయి లేదా విడాకులకు సిద్ధంగా ఉండు" కోపంగా అన్నాడు శ్రీధర్.

"వద్దండీ అలా మాట్లాడకండి నాకు పుట్టిన ఆడపిల్లే కావాలి. మిమ్మల్ని కన్నతల్లి ఆడది కాదా!.. ఆడపిల్లలంటే ఎందుకింత ద్వేషం... ఈ విషయంలో నేను మీ మాట వినదల్చుకోలేదు. పోరాటం

(మిగతా 23వ పేజీలో)

ముదిగంటి సుజాతారెడ్డి

పరిష్కారం

"మా పక్కింట్లో వుండే ముసలివాళ్ళను చూస్తే నాకు జాలి వేస్తుందే సుశ్శీ! ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుళ్ళు వున్నారు. అందరూ బాగా చదువుకొని కంప్యూటరు కంపెనీల్లో, ఇంటర్నేషనల్ బ్యాంకుల్లో పని చేస్తున్నారు. బోలెడు సంపాదన. సంపాదన మస్తుగా వున్నా వాళ్ళకు తల్లిదండ్రుల దిక్కు చూసే సమయం లేదు. వాళ్ళను పలకరించే తీరిక లేదు. దేశవిదేశాలకు విమానాల్లో తిరుగుతారట. కాని నెలకొక్కసారైనా తల్లిదండ్రులను చూడటానికి పలకరించటానికి వాళ్ళు రారు. పాపం!..." అంది లలిత. దాని మాటలు వింటే నాకేం కొత్తగా లేవు. అదే మాట దాంతో అన్నాను.

"లల్లీ! ఈ కాలంల పిల్లలకు తల్లిదండ్రులను చూసే ఓపిక తీరికా లేవు. వాళ్ళకు బోలెడు పనులు. ఊపిరాడని పనులు. తమ పని జీవితాలను గురించి తప్ప మరొకరి గురించి ఆలోచించే సమయం లేదు వాళ్ళకు. అదీ ఈనాటి సమస్య!" అన్నాన్నేను.

"అవునే సుశ్శీ! ఎట్లా సమయముంటుంది. ఇంటర్నెట్‌లు, ఏటియమ్‌లు, క్రెడిట్ కార్డులు, సెల్‌ఫోన్లు వాటిని ఎట్లా వాడుకోవాలి. వాటిల్లోని సౌకర్యాలేమిటో తెలుసుకోవటానికి వున్న సమయం సరిపోవటం లేదు. ఇక పక్కనున్న వాళ్ళనో, సొంత తల్లిదండ్రులనో పట్టించుకునే సమయం ఎక్కడ్నుంచి వస్తుంది." లలిత మూడు వంకర్లు తిప్పింది. దాని తీరు చూసి నాకు నవ్వు వచ్చింది.

"నువ్వు అన్నది నూరు శాతం నిజమే లల్లీ! ఇప్పటివాళ్ళకు ఎన్ని రకాల సెల్‌ఫోన్లున్నాయి, వాటిని ఎవరు ఎక్కువ సౌకర్యాలతో, ఎక్కువ ఫ్రీకాల్స్‌తో సిమ్‌కార్డు ఇస్తున్నారో సెల్‌ఫోన్లతో వుండే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకునేటందుకే బోలెడు సమయం శక్తి ఖర్చవుతాయి. ఇక ఇంటర్నెట్‌ల సమాచారాలను జీర్ణించుకోవటానికి సమయం కావాలి. ఎన్ని క్రెడిట్ కార్డులు ఎట్లా సంపాదించాలి, ఎట్లా ఉపయోగించుకోవాలి క్రెడిట్ కార్డుల బిల్లులను ఎప్పుడు ఎక్కడ చెల్లించుకోవాలి. ఈ ఆలోచనలతో వాళ్ళ మెదడు వేడెక్కుతున్నది. పాపం! వాళ్ళు ఇతరులను గురించి గాని సొంత తల్లిదండ్రుల గురించి గాని ఆలోచించడానికి బుర్రలో ఖాళీ ఎక్కడుంటున్నది చెప్పు!" అన్నాన్నేను.

"మా పక్కింటి ఆంటీ అంకుల్ గురించి చెప్పాను కదా! - వాళ్ళకు బాగా వయస్సయింది. ఆంటీకి వంటచేసే ఓపిక కూడా లేదు. ఎక్కడి నుంచో క్యారియర్ తెప్పించుకొని భోజనం చేస్తారు. తీరిక సమయాల్లో టీవీ చూస్తారు. కాని ఒకరి మీద ఆధారపడి వుండాలని అనుకోరు. పిల్లలు తమని సరిగ్గా చూడటం లేదని బాధపడరు" అంది లలిత.

"అది చాలా మంచిదే లల్లీ! వయస్సు మీద పడగానే చాలా మంది కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు సేవలు చేయాలని ఆశిస్తారు. పిల్లలు తమను గురించి పట్టించుకోవాలని ఆశలు పెట్టుకుంటారు. అంతేగాని తమ జీవితాలను తాము ఒకరిమీద ఆధారపడకుండా చాతనయినంత వరకు స్వతంత్రంగా బతకాలని అనుకోరు. మా పక్కింటి ఆంటీ అంకుల్‌లు ఆ విధంగా ఇంకా శక్తి వున్నంత కాలం స్వతంత్రంగా ఇతరుల సహాయం సానుభూతులు కోరుకోకుండా జీవిస్తున్నారంటే చాలా సంతోషించదగ్గ విషయమే!" అన్నాన్నేను. "అంత కఠినంగా ఆలోచిస్తావేమిటే సుశ్శీ నువ్వు. నలుగురు పిల్లలున్నారు. మంచి పొజిషన్లల్లో వున్నారు. వాళ్ళను చూసుకోవాలని అనాలి కాని వాళ్ళకు వాళ్ళు స్వతంత్రంగా ఒంటరిగా బతకాలని చెప్పటం ఏం బాగా లేదు నాకు" అంది లలిత కోపంగా.

"ఒంటరిగా బతకటమంటే దీనావస్థ అని ఎందుకనుకోవాలి చెప్పు! పెద్దవాళ్ళు తమ రుచులకు అభిరుచులకు అనుగుణంగా బతుకును బతకటం ఒంటరిగా దీనంగా అని అనుకోకూడదు. ఆс.. ఒక్కటి వాళ్ళను చూడటానికి వాళ్ళ బాగోగులు కనుక్కోవటానికి పిల్లలు మనవలు మనుమరాళ్ళు అప్పుడప్పుడు రావాలి. కొంతకాలం గడపాలి. అంతేగాని వాళ్ళ దిక్కే చూడకపోవటమనేది చాల క్రూరం అనుకో!" అన్నాన్నేను.

"ఇంకొక సమస్య కూడా వస్తున్నదే లల్లీ! పూర్వకాలం కన్నా ఇప్పుడు ఆయుష్షు ప్రమాణాలు పెరిగాయి. వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. సీనియర్ సిటిజన్లు అధికమవుతున్నారు. అందుకని వృద్ధాప్య సమస్యలు ఇప్పటిలాగ మునుపు ఎక్కువగా కన్పించేవి కావు. వయస్సు మళ్ళిన వాళ్ళు తమ పిల్లల దగ్గర వుండే వాళ్ళు. ఇప్పటి వృద్ధులట్లా కాదుగద! వాళ్ళు కూడా కొంత వ్యక్తిత్వాన్ని కలిగి వుంటున్నారు. స్వేచ్ఛా జీవితాన్ని కోరుకుంటున్నారు. చాలామంది ఆర్థికంగా కూడా స్వావలంబనతో వుంటున్నారు. కాబట్టి వీళ్ళ సమస్యలు వేరేగా వుంటున్నాయి. వీళ్ళు కేవలం ప్రేమ పలకరింపులు కోరుకుంటున్నారు. ఒంటరితనాన్ని వదిలించుకోవాలనుకుంటున్నారు అన్నాన్నేను.

"మరి అటువంటప్పుడు పిల్లలు మనుమల మనుమరాండ్ల ప్రేమలు ఆప్యాయతలు పలకరింపులు కోరుకున్నవి. దొరకటం లేదు కద. ఈనాటి వృద్ధులకు గల ఆ సమస్యను యువత గుర్తించాలి. అవునా కాదా సుశ్శీ! అదీ నువ్వూ ఒప్పుకుంటున్నావు కదా!" అడిగింది లలిత నా కండ్లల్లో కండ్లు పెట్టి చూస్తూ.

"లల్లీ! అది నేనూ ఒప్పుకుంటున్నాను. పండుగలు పెళ్ళిళ్ళు మొదలైన సందర్భాల్లో ఎంత తీరిక లేకపోయినా పెద్దవాళ్ళతో గడపటం సెలవు దినాల్లో పెద్దవాళ్లను పలకరించటం తమ సుఖ సంతోషాల్లో వాళ్ళను భాగస్వాములుగా చేసుకోవటం అనేది తప్పకుండా యువత పాటించాలి. పెద్దవాళ్ళు కూడా ఎప్పుడూ పెత్తనం చలాయించటం కాకుండా పిల్లలతో హాయిగా గడపటం నేర్చుకోవాలి. అప్పుడే ఈ వృద్ధాప్య సమస్యలకు పరిష్కారాలుంటాయి!" అన్నాన్నేను. లలిత కూడా అవునన్నట్లుగా తలూపింది. ✤

మేకల మదన్‌మోహన్‌రావు

చిలుక సలహా

ఒక వర్తకుని దగ్గర ఓ చిలుక వుంది. అదంటే ఆయనకు ప్రాణం. దాన్ని ఒక వెండి పంజరంలో వుంచి, దానికి రకరకాల పండ్లు, కాయలు పెట్టేవాడు. ఇంకా ఆ చిలుక కోరిన దేన్నయినా వెంటనే తెప్పించి పెట్టేవాడు. ఆ చిలుక చాలా తెలివైనది. ఆయనతో అది గంటలు గంటలు సంభాషించేది.

అయితే చిలుకకు పంజరంలో వుండటం ఇష్టంలేదు. స్వేచ్ఛగా బతకటమే దానికి ఇష్టం. తనను పంజరంలో నుండి తీసి స్వేచ్ఛగా వుండనివ్వమని అది ఆ వ్యాపారిని వేడుకునేది. చిలుక జాలిగా ఎన్నిసార్లు అడిగినా ఆ వర్తకుడు "అది తప్ప వేరే ఏదన్నా అడుగు" అనేవాడు.

ఒకరోజు చిలుక, "నాకు స్వేచ్ఛనిస్తే నీకు మూడు సలహాలు ఇస్తాను. అవి నీకు జీవితాంతం ఎంతో ఉపయోగపడతాయి" అంది.

ఆ వర్తకునికి చిలుకంటే ఇష్టం. డబ్బంటే మరీ ఇష్టం. 'దీని సలహాలు నాకు అంతులేని సంపాదన తెచ్చి పెడతాయేమో. అటువంటప్పుడు అది కోరుకున్నట్టు దానిని స్వేచ్ఛగా వదిలిపెడితే పోలా' అని మనసులో అనుకుని పంజరం తలుపు తెరిచి, "వెళ్లిపో" అన్నాడు.

ఆ చిలుక ఆయన చేతి మీద వాలి, "నీకు ఇచ్చిన మాట ప్రకారం మూడు సలహాలు చెప్తాను. వాటిలో మొదటిది పోయిన సంపద గురించి ఎప్పుడూ విచారించకూడదు" అంది.

'అది అంత మంచి సలహా ఏం కాదు..' అనుకున్నాడు వర్తకుడు. కానీ పైకి ఏమీ అనలేదు. చిలుక ఆ ఇంటి పైకప్పు మీద వాలి, "నీకు చెప్పిందంతా నిజమని ఎప్పుడూ నమ్మకు. ఇది నా రెండవ సలహా" అంది.

"నాకు తెలియనిదేదైనా చెప్పు" అన్నాడు వర్తకుడు కోపంగా.

"నా పొట్టలో రెండు అమూల్యమైన రత్నాలున్నాయన్న సంగతి నీకు తెలియదు" అంది చిలుక.

"రెండు అమూల్య రత్నాలా? నిన్ను స్వేచ్ఛగా వదిలిన నేనెంత మూర్ఖుణ్ణి? ఇలా చేసినందుకు నా జీవితాంతం వగస్తూనే వుంటాను" అన్నాడు వర్తకుడు.

దానికి చిలుక కిలకిలా నవ్వుతూ "నా మూడవ సలహా వినాలని లేదా?" అంది.

"చెప్పు" అన్నాడు వర్తకుడు కోపంగా.

"పోయిన దాని గురించి దుఃఖించొద్దు అని నీకు సలహా ఇచ్చాను. కానీ నన్ను పోగొట్టుకున్నందుకు నువ్వు దుఃఖిస్తున్నావు. నువ్వు విన్నదల్లా ఎప్పుడు నమ్మకు అని చెప్పాను. కానీ నా కడుపులో రెండు అమూల్య రత్నాలున్నాయని చెప్పగానే వెంటనే నమ్మావు. ఒకవేళ నిజంగా నా కడుపులో రెండు రత్నాలుంటే నేను ఎట్లా బతికివుండగలను? నా మూడవ సలహా ఏమిటంటే.... 'విను'. నీ చెవులతో కాకుండా మనసుతో విని నేర్చుకో..." అంటూ చిలుక రివ్వున ఎగిరిపోయింది. వర్తకుడు మాత్రం తెల్లముఖం వేసుకుని అది వెళ్లినవైపే చూస్తుండిపోయాడు.



చిన్నారి చిత్రకారులు

పి.లెనిన్ బాబు,
8వ తరగతి,
పోర్టు హైస్కూల్,
మల్కాపురం,
విశాఖపట్నం.

జి.వి.నాగరాజు, 9వ తరగతి,
సికె.బోయిస్ హైస్కూల్,
మంగళగిరి, గుంటూరు.

ఎం.హరీష్ కుమార్,
చినకాకాని, గుంటూరు.



ఎ.రంజిత్,
హనుమాన్ నగర్ కాలనీ,
దేవరకొండ.

వై.ప్రభాత్,
6వ తరగతి, చక్రధర పబ్లిక్ స్కూల్,
సోంపేట, శ్రీకాకుళం.

ఏమి దృశ్యం?

ఈ వారం మీకోసం ఓ వెరైటీ బొమ్మ వచ్చింది. అంద
ఏం కనిపిస్తోందో చెప్పకోండి? గబాల్న చెప్పాలి. ఇంతసేపా!

'ఊ... పెద్ద చెట్టు, ఎదురుగా కొండలు, గుడిసెలు... ఇ
వాటిని చూస్తున్న అమ్మాయి. అటువైపు తిరిగి వుందిలే. ఆమె ఎంచ
ప్రకృతి అందాలను ఆస్వాదిస్తోంది' అంటున్నారు కొందరు నేస్తాలు. స
ఓకే.

కానీ మిగతా సగం మాటేంటి? ఆ బొమ్మలో ఇంకా ఏ
వుంది. మీరు దాన్ని మిస్సవుతున్నారు. మరి మమ్మల్ని చెప్పమంటారా!
జాగ్రత్తగా చదవండి. ఈ బొమ్మలో ఒక పెద్ద తల వుంది. అటు
తిరిగివున్న అమ్మాయే తలలోని ముక్కు. రెండు ఇళ్లే కళ్లు. ఇ
నరికేసిన చెట్టు మొదలే తలలోని నోరు. ఏంటి బాగా కనిపించిం
మరి వచ్చే వారం మరో మంచి బొమ్మతో మీ ముందుకు వస్తాం. టా

చుక్కలు కలిపితే...!

'L'తో మొదలయ్యే ఎనిమిది పదాలు

E	D	L	I	P	A	P
E	T	D	L	Z	O	R
R	A	A	O	I	F	D
R	E	A	L	I	E	E
H	C	A	O	I	L	S
T	R	B	G	N	G	S
N	I	Y	I	C	E	R

ఇంగ్లీషు పజిల్

హాయ్ నేస్తాలూ! మీకు ఈ వారం నుంచి ఇంగ్లీషు పజిల్ ఇస్తున్నాం. సంతోషమేనా. పైన ఒక బాక్సు వుందికదా. అందులో కొన్ని అక్షరాలు వున్నాయి. మధ్య బాక్సులో 'L' వుందికదా. దానితో మొదలయ్యే 8 పదాలు రాయాలి. అందుకు ఓ షరతు వుంది. ఒకసారి ఉపయోగించిన అక్షరాన్ని మరోసారి వాడకూడదు. 'L' మాత్రం ప్రతి పదానికి మొదట వస్తుంది. ఓకేనా. ఎంచక్కా ఆ ఎనిమిది పదాలను రాసి పంపిస్తే మీ పేరు, తరగతి, ఊరు ప్రచురిస్తాం. మరి మా చిరునామా:
ఇంగ్లీషు పజిల్, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

ఎంత సమయం పడుతుంది?

లెక్కల ట్రిక్కులు

టింకూ వాళ్లకి చాలా పెద్ద ఇల్లు వుంది. అందులో అన్ని సౌకర్యాలూ వున్నాయి. ఆఖరికి స్నానం చెయ్యడానికి చక్కటి తొట్టె కూడా వుంది. ఎంచక్కా అందులో కూర్చుని పూర్తిగా మునుగుతూ స్నానం చెయ్యొచ్చు. అసలు విషయం ఏంటంటే... ఆ తొట్టె నిండా నీళ్లు వట్టడానికి 100 సెకండ్లు పడుతుంది.



టింకూ వచ్చి తొట్టెలోకి నీళ్లు వదిలాడు. ఒక్క నిమిషం గడిచింది. మరి ఆ తర్వాత తొట్టె నిండటానికి ఎంత సమయం పడుతుంది? మీరు చాలా తెలివిగలవాళ్లుకదా. చిటికెలో చెప్పెయ్యాలి.

జవాబు:

అబ్బా నేస్తాలూ! ఇంకా తెలీలేదా? తొట్టె నిండడానికి వంద సెకండ్లు పడుతుందన్నాంకదా. ఒక్క నిముషంపాటు తొట్టె నిండిందని కూడా చెప్పాం. నిమిషానికి 60 సెకండ్లు. మరి వంద సెకండ్లలోంచి 60 సెకండ్లు తీసేస్తే 40 సెకండ్లు మిగిలింది. అంటే ఇంకా తొట్టె నిండడానికి 40 సెకండ్ల సమయం పడుతుందన్నమాట.

పావురము-డేగ

పంచతంత్ర కథలు

పాండ్య దేశంలో మధుర అనే పట్టణం వుంది. అందులో ఒక పెద్ద గుడి వుంది. ఆ గుడి గోపురం మీద భార్యాభర్తలైన రెండు పావురాలు జీవిస్తున్నాయి. ఒకరోజు ఆ పావురాలు నేల మీద ఆడుకుంటున్నాయి. అప్పడు ఆకాశంలో ఎగురుతున్న డేగ ఒకటి వాటిని చూసి తన్నుకు పోవాలనుకుంది. కానీ గుడి ముందు మనుషులు తిరుగుతుండడం వల్ల అప్పటికి వెళ్లిపోయింది.

ఆడ పావురం ఆ డేగను చూసి దాని ఉద్దేశం గ్రహించింది. గుడి ముందు మనుషులు లేకపోతే ఆ రోజుతో తమ బతుకు కడతేరి వుండేదని అర్థం చేసుకుంది. అప్పడు మగ పావురంతో, "మన అదృష్టం బావుండి ఈ రోజు డేగ చేత చిక్కకుండా బతికిపోయాం. అది మరింత పట్టుదలతో రేపో, మాపో మన కోసం రాకపోదు. కనుక ఇంకొక చోటికిపోయి జీవిద్దాం. బలవంతులతో విరోధం మంచిది కాదు. కాబట్టి తక్షణమే ఇంకొక చోటికి పోదాం" అంది.

మగ పావురం దానికి ధైర్యం చెప్పింది. "చిన్న విషయానికే కంగారు పడుతున్నావు. వున్న ఊరు కన్నతల్లివంటిది. ఎవరో ఏదో చేస్తారని వున్న ఊరిని విడిచిపెట్టవచ్చా? డేగ పెద్దదని భయపడుతున్నట్లున్నావు. అదీ పక్షి జాతిలోనిదే. మనం కూడా పక్షి జాతికి చెందిన వారమే. ఒక పక్షి మరొక పక్షిని చూసి భయపడటమా? నువ్వలా భయపడాల్సిన అవసరం లేదు. మన జోలికి వస్తే దాని అంతు చూస్తా! నా వాడి ముక్కుతో దాని పొట్టలో ఒక్క పోటు పొడిస్తే చచ్చి వూరుకుంటుంది. ధైర్యంగా వుండు" అంది మగ పావురం. ఆ మాటలకు ఆడపావురం ఎదురు చెప్పలేకపోయింది.

రెండు రోజులు గడిచాయి. డేగ వచ్చి గుడి మీద పావురాల కోసం నక్కి దాక్కుంది. సూర్య కిరణాలు గుడి మీద పడుతుండగా పావురాలు రెక్కలు విప్పకొని బయటకు వచ్చి ఆకాశంలో గిరికీలు కొడుతున్నాయి. అప్పటికి భక్తులెవరూ గుడికి రాలేదు. ఇదే మంచి సమయమని భావించిన డేగ రివ్వున కిందకి వాలి మగ పావురాన్ని తన్నుకుపోయింది. ఆడ పావురం గుడిలోకి పోయి ప్రాణం కాపాడుకుంది.

హిరణ్యగర్భుడు ఈ కథ చెప్పి "తెలిసి చేసిన తప్పలకు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందే. తన శక్తినీ, డేగ శక్తినీ అహంకారంతో సరిగ్గా అంచనా వేయలేక మగ పావురం శిక్ష అనుభవించింది. ఆడ పావురం ప్రాణాలు కాపాడుకుంది. బలం వున్నప్పటికీ మాట మిగలకూడదు. మాటలు ఈటె పోట్లకన్నా బాధాకరమైనవి. గొడ్డలితో చెట్టు నరికినా కొంతకాలానికి అది చిగురిస్తుంది. కానీ మాటలు పడినవాడు ఎంత కాలమైనా ఆ బాధ మరచిపోలేడు. కనుక ఏ సమయంలో ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడరాదో తెలుసుకోవాలి. పూర్వం ఒక గాడిద చెప్పడు మాటలు మీరి, కోరి చావును తెచ్చుకుంది. ఆ కథ విను" అని చెప్పసాగాడు.

ఆ గాడిద కథ ఏంటి? అది ఎలా చనిపోయింది? తెలియాలంటే... వచ్చేవారం వరకు వే...చి...వుం...డా...ల్సిం...దే!

వెలుగు ప్రదాత

వాతావరణం వేడిగా ఉంది. ఎండ వేడిమితో బాటు ఉక్కపోత కూడా ఎక్కువగా ఉండటంతో ఆసుపత్రిలో రోగులు అవస్థలు పడుతున్నారు. రోగుల కోసం వచ్చిన బంధువులు ఆసుపత్రి ప్రాంగణంలో చెట్లకింద విశ్రాంతి తీసుకుంటున్నారు.

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

కాకినాడ ప్రభుత్వాసుపత్రి ప్రశాంతంగా ఉంది. జిల్లా కేంద్రంలో ఉన్న ఏకైక ప్రభుత్వ వైద్యాలయం గాబట్టి మారుమూల ప్రాంతాల నుంచి కూడా ఎంతోమంది వస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండటం దాని ప్రత్యేకత. రంగరాయ మెడికల్ కాలేజి విద్యార్థులు కూడా అక్కడే ఎక్కువగా ఉంటుంటారు.

ఆసుపత్రిలో ఓ మూల కంటివైద్య విభాగం ఉంది.

కంటి పరీక్షలు చేయడానికి, ఆపరేషన్లు నిర్వహించడానికి స్పెషలిస్టులైన వైద్యులు కూడా వున్నారు.

ఆ విభాగంలో ఆరు బెడ్‌లతో చిన్నగది.

అందులో మూడవ నెంబరు మంచంపైన కర్రి సత్యవతి పడుకొని ఉంది. ఆమె ఎడమ కన్నుకు కట్టుకట్టి ఉంది. బాధ తెలియకుండా ఇంజక్షన్ ఇవ్వడంతో నిస్త్రాణంగా పడుకుని ఉంది. ఆ సమయంలో భర్త, ఇద్దరు పిల్లలు, బంధువర్గం అక్కడ కూర్చుని వున్నారు.

గదిలో ఫేను తిరుగుతున్నా గాలి తగలకపోవడంతో విసినకర్రతో విసురుతున్నారు. సత్యవతి మత్తులో ఉంది.

ఆమెకు చికిత్స చేస్తున్న కంటివైద్య విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.సుధాకర్‌రెడ్డి అక్కడికి వచ్చారు. అతడిని చూసి కూర్చున్న వారు లేచి నిల్చున్నారు. పక్కనున్న ఇద్దరు నర్సులు డ్యూటీ డాక్టర్ దగ్గరికి వచ్చారు 'పేషంటుకు ఎలా ఉంది?' ప్రశ్నించారు.

"ప్రస్తుతం మత్తులో ఉంది. ఇంజక్షన్ చేసి అరగంట అయ్యింది–" డ్యూటీ డాక్టర్ వివరించారు.

"సార్! మా ఆవిడకు చూపువస్తుందా?" సత్యవతి భర్త సత్యనారాయణ ఆతృతగా అడిగాడు.

ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి ఎటువంటి భావం లేకుండా అతనివైపు చూశాడు– "చూద్దాం.. ప్రమాదం మాత్రం తీవ్రమైనదే.. ఇంకా పరీక్షల రిపోర్టులు వస్తే తప్ప ఏ విషయం చెప్పలేం.." వివరించాడు.

సత్యనారాయణ ప్రొఫెసర్‌ని వదలిపెట్టలేదు – 'సార్! మా ఆవిడకు చూపు ఎలాగైనా రప్పించాలి. రెండు రోజుల నుంచి పిల్లలు బెంగతో పచ్చి మంచినీళ్లు కూడా తాగలేదు.. ఆమెకు ఏమైనా అయితే నేనూ తట్టుకోలేను..." అతని మాటల్లో విచారపు జీర..

ప్రొఫెసర్ అతని భుజాన్ని తట్టి – "ప్రాణానికి ఏం ప్రమాదం లేదు. కన్ను విషయమే డౌట్‌గా ఉంది. సాధారణంగా తెల్లగుడ్డుకు ప్రమాదం జరిగితే చూపు కష్టం అవుతుంది..." చెప్పాడు.

"చూపురాదా?" సత్యనారాయణ ఆతృతగా ప్రశ్నించాడు.

"సాధారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే కన్ను ఆటోమెటిగ్గా మూతపడిపోతుంది. ప్రమాదంలో నల్లగుడ్డు మాత్రమే దెబ్బతింటుంది. కాని మీ భార్య సత్యవతి తెల్లగుడ్డు పాడైపోయింది. అందుకే డౌట్‌గా వుంది. దీనిని వైద్య పరిభాషలో 'సింపథిటిక్

ఆప్తమైటిస్' అంటారు. అరుదుగా కొంతమందే గురవుతారు..." సుధాకర్‌రెడ్డి వివరించారు.

తర్వాత డ్యూటీ డాక్టర్‌ను పిలిచి "కన్ను చాలా సున్నితమైన శరీర భాగం ఎప్పటికప్పుడు ట్రీటుమెంటు ఫాలో అప్ చేయండి.. మళ్ళీ రేపు వస్తాను. అవసరమైతే నన్ను కాంటాక్టు చేయండి..." ఆదేశాలు ఇస్తూ వెళ్ళిపోయారు.

డాక్టర్ మాటలు విని కర్రి సత్యవతి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అనుకోకుండా జరిగిన ప్రమాదం వారిని విచలితుల్ని చేసింది.

మాగన్నుగా నిద్రపోతున్న సత్యవతికి ప్రభుత్వ వైద్యశాల ప్రొఫెసర్ చెబుతున్న మాటలు అస్పష్టంగా వినిపించాయి. వినాలని అనుకోకపోయినా ఆమె మనసు డాక్టరు మాటల్ని గ్రహించాయి. అప్రయత్నంగా ఆమె ఎడమ కన్నులో సలుపు మొదలైంది.

జరిగిన ప్రమాదం మదిలో మెదిలింది.

* * *

రాజమండ్రి సమీపంలో వెంకటనగరం గ్రామానికి చెందిన కర్రి సత్యవతి మధ్య తరగతి కుటుంబీకురాలు. ఆ గ్రామంలో ఎక్కువ మంది గేదెలను పెంచుతూ పాల వ్యాపారాన్ని చేస్తుంటారు. పాలు పితికిన తర్వాత గేదెలను మేత కోసం ఊరవతలకు తోలుకుని పోతుంటారు. తిరిగి సాయంత్రం వస్తుంటారు. కొంతమంది ఇళ్ళవద్దే గేదెల పెంపకాన్ని చేపడుతుంటారు.

మే 24 సోమవారం 2004 సంవత్సరం.

వెంకటనగరంలో గేదెలను మేతకు తీసుకుని వెళ్ళి తిరిగి వస్తున్నారు. మట్టిరోడ్డు వెంబడి గేదెలు గ్రామానికి తిరిగి వస్తున్నాయి.

ఆ సమయంలో సత్యవతి ఇంటి నుంచి బయలుదేరింది.

ఎదురుగా వస్తున్న గేదెలను తప్పుకోవడానికి రోడ్డు పక్కన నిల్చుంది. ఆ సమయంలో గేదె ఆమె వైపు కొమ్ములను విసిరింది. అందులో కొమ్ము ఆమె ఎడమ కంటికి తగిలింది. అంతే సత్యవతి కన్ను పట్టుకుని కిందకి పడిపోయింది.

కంటి నుంచి రక్తం కారడం మొదలైంది.

చుట్టుపక్కల వారు ఆమెను దగ్గరలో వున్న ఆర్.ఎం.పి. వైద్యుని దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆయన ప్రథమ చికిత్స చేసి కట్టుకట్టారు. ఏమి చేస్తే ఏమి వస్తుందోనన్న భయంతో "కంటివైద్యుని వద్దకు తీసుకువెళ్ళండి" అంటూ సలహా ఇచ్చారు.

కుటుంబ సభ్యులంతా గాయపడిన సత్యవతిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. వైద్యులు పరీక్షించి పక్కనున్న కంటి విభాగానికి పంపించారు. డ్యూటీడాక్టర్లు ఆమె పరిస్థితిని గమనించి వార్డులో బెడ్‌ని కేటాయించారు. సత్యవతి ఔట్‌పేషంటుగా ఆసుపత్రిలో చేరింది.

* * *

సాయంత్రం ఐదు గంటలైంది.

ఆకాశం మేఘావృతం కావడంతో వెలుగు తగ్గిపోయింది. మనకచీకట్లు ఆవరిస్తున్నట్లుగా వాతావరణంలో మార్పు వచ్చింది.

దూరంగా పొలం పనులు ముగించుకుని ఇళ్ళకు చేరుకుంటున్న రైతుల మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"అమ్మా! మీరు చేసిన త్యాగం చాలా గొప్పది. మీ ప్రమాదాన్ని అశ్రద్ధ చేస్తే రెండు కళ్ళూ కోల్పోయి శాశ్వత అంధత్వం వచ్చేది. కానీ మీరు మీ కంటిలో నల్లగుడ్డును దానం చేయడం వల్ల మరొకరికి కంటి చూపు వచ్చింది. మీరు శాశ్వతంగా ఒక కన్ను కోల్పోయి మరొకరికి పూర్తి చూపును ఇచ్చారు –" ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి ఆమెను అభినందించారు. సత్యవతికి రెండు క్షణాలు ఏమి మాట్లాడాలో తెలియలేదు. తర్వాత తేరుకుని – "బాబు! నేను చేసింది త్యాగమని అనుకోవడం లేదు. నా కన్నును కోల్పోలేదు. ఆ కన్ను బతికే ఉంది, నాగేశ్వరరావు గారి ద్వారా లోకమంతా చూస్తుంది–" అంది.

కనుచూపు మేరలో పంట పొలాలు.

వాటిని ఆనుకుని వరుసగా ఇళ్ళు. అందులో పెంకుటిల్లు ముందు నాగేశ్వరరావు కుర్చీలో కూర్చున్నాడు. వర్షం కురుస్తుందేమోనన్నట్లు చల్లటి గాలి స్పర్శ శరీరానికి తగిలి హాయి కలిగిస్తోంది.

కరప మండలంలో విజయరాయుడిపాలెం చిన్న గ్రామం. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా చేసుకుని గ్రామస్తులంతా జీవనాన్ని సాగిస్తున్నారు. ఆ ఊరిలో చాలా మంది చిన్న రైతుల్లో నాగేశ్వరరావు కూడా ఒకడు.

2003 జనవరిలో జరిగిన ప్రమాదం అతడ్ని పాక్షిక అంధుడిగా మార్చింది. ఒకప్పుడు హుషారుగా చలాకీగా అన్ని పనులూ తన మట్టుకు తానే చేసుకునే నాగేశ్వరరావు ఏడాది కాలంగా ఒంటరితనంతో బాధపడుతున్నాడు.

"నాన్నా! చీకటి పడింది. వర్షం కూడా రావచ్చు. కుర్చీ లోపల వేయించేదా?" కూతురు కృష్ణవేణి అడిగింది.

కృష్ణవేణి నోటివెంట 'చీకటి' అనే పదం విని నాగేశ్వరరావు మనసు బాధతో బరువెక్కింది. ఏడాది కాలంగా కుడికంటికి వెలుగు అంటే తెలియదు. రోజులో ఇరవై నాలుగు గంటలూ ఒకలాంటి అంధకారంలోనే గడుపుతున్నాడు.

"వర్షం రాలేదు కదా? చల్లటి గాలి వీస్తోంది. కాసేపు ఇక్కడే కూర్చుంటాను!" నాగేశ్వరరావు కూతురుకు సమాధానం ఇచ్చాడు. ఇంటి అరుగు మీద కూర్చుంటే కనుచూపు మేర పచ్చని పొలాలు కనిపిస్తాయి. పచ్చని తివాచీ పరిచినట్లున్న ఏపుగా ఎదిగిన పంటలను చూడటం నాగేశ్వరరావుకు ఎంతో సరదా..

ప్రతిరోజూ ఓ అరగంట అయినా ఇంటి అరుగు మీద కూర్చుని పంటపొలాలను చూడటం... రోడ్డుమీద వెళ్ళి వచ్చే వారిని పలకరించడం అలవాటు... ఏడాది క్రితం పాక్షిక అంధత్వం వచ్చినప్పటికీ నాగేశ్వరరావు అలవాటు తప్పలేదు.

ఏడాది క్రితం నాగేశ్వరరావు విజయరాయుడిపాలెంలో తన స్వంత పొలంలో పని చేస్తున్నాడు. ఏపుగా ఎదిగిన వరిపైరును కోయించడానికి కూలీలను పెట్టాడు. ఎవరిపనుల్లో వారున్నారు. కోసిన వాటిని కొంతమంది కుప్పగా పెడుతున్నారు.

పొలం మధ్యలో ఉన్న నాగేశ్వరరావు వరి కంకులను తొలగిస్తూ దారి చేసుకుని ముందు వస్తుండగా వరివెన్ను బలంగా కంటికి తగిలింది. అసలే సున్నితమైన భాగం అయినందున "అబ్బా!" అంటూ నాగేశ్వరరావు బాధగా మూలిగాడు. కుడికన్ను మూతపడిపోయింది.

ట్రాక్టర్ డ్రైవర్‌ను పిలిచి ట్రాక్టర్ పైన వెంటనే కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్ళాడు. వైద్యులు వెంటనే రంగంలో దిగారు. చేయవలసిన పరీక్షలన్నీ ముగించారు. అయితే అతని కంటిలో నల్లగుడ్డు దెబ్బతింది. దాంతో కన్ను ఇక పని చేయదని కంటివైద్య నిపుణులు ధృవీకరించారు. తర్వాత ఎన్ని ప్రయత్నాలు చేసినా ఒక కన్ను మాత్రం పని చేయదని తేల్చి చెప్పారు.

"డాక్టర్! ఒక కన్ను ఇంక పని చేయదా?" నాగేశ్వరరావు బాధగా అడిగాడు.

"నీ కంటిలో తెల్లగుడ్డు బాగుంది. కానీ నల్లని భాగం పూర్తిగా దెబ్బతింది. నల్లనిగుడ్డు అమర్చేంతవరకూ ఇబ్బంది తప్పదు!" వైద్యులు చెప్పారు.

"ఇక ఎప్పటికీ ఇంతేనా?"

"ఎవరైనా కంటిలో నల్లని భాగం దానం చేస్తే అదీ బతికి ఉండగా అప్పుడు మాత్రం కొంతప్రయోజనం కలుగుతుందని ఎవరైనా అటువంటివారు తారసపడినట్లయితే మీకు తెలియజేస్తాం... మీ చిరునామా ఇవ్వండి!" అన్నారు.

నాగేశ్వరరావు తన చిరునామా ఇచ్చి ఒంటికన్నుతో తన గ్రామానికి తిరిగి వచ్చాడు. తనకు బతికి ఉండగా కనుగుడ్డు దానం చేసే వ్యక్తి ఎవరైనా లభిస్తారా అని కొద్దిరోజులు ఆశించాడు. వైద్యులను రెండు మూడుసార్లు సంప్రదించాడు. ప్రయోజనం లేదని నిరాశతో ఉండిపోయాడు.

అయితే కన్ను కోల్పోయిన పదిహేడు నెలల తర్వాత ఆ దాత దేవతలా అతనికి సాక్షాత్కరించింది.

మే 25 మంగళవారం నాగేశ్వరరావుకు కాకినాడ ప్రభుత్వాసుపత్రి నుంచి చల్లని కబురు అందింది. నల్లని కనుగుడ్డు దానం చేసే వ్యక్తి దొరికారని తక్షణం రావాలని.

నాగేశ్వరరావు ఆనందానికి అవధులు లేవు. కుటుంబ సభ్యులతో కాకినాడ బయలుదేరాడు.

* * *

కాకినాడ ప్రభుత్వాసుపత్రి.

కంటివైద్య విభాగంలో కర్రి సత్యవతి తన ఎడమ కంటిలో తెల్లగుడ్డు దెబ్బతినగా మిగిలిన నల్లగుడ్డును నాగేశ్వరరావుకు దానం చేయడానికి అంగీకరించింది. నాగేశ్వరరావు కుడికంటిలో తెల్లగుడ్డు మధ్యలో చితికిపోయిన సత్యవతి కనుగుడ్డు అమర్చడానికి అంగీకారం కుదిరింది.

ఆసుపత్రి వైద్యులు ఇరువురు వ్యక్తుల నుంచి సంతకాలు తీసుకున్నారు. ఇరు కుటుంబాల వ్యక్తులు ఈ దానానికి అంగీకరించారు.

మే 29 శనివారం 2004.

ఆసుపత్రిలో అరుదైన ఆసుపత్రికి వైద్యులు శ్రీకారం చుట్టారు. ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ వి.సూర్యనారాయణల ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేశారు. రెండు గంటల పాటు ప్రయత్నించి సత్యవతి ఎడమకంటి నుంచి ఉపయోగపడే కనుగుడ్డును తొలగించి నాగేశ్వరరావుకు అమర్చారు.

ఆపరేషన్ విజయవంతం అయ్యింది.

ఒక కన్నుతో ఇబ్బంది పడుతున్న నాగేశ్వరరావుకు మరో కన్ను లభించింది. సత్యవతి కనుగుడ్డు అమర్చడంతో రెండు కళ్ళూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల సంతోషానికి లెక్కలేదు. ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా తనకు చూపును దానం చేసిన సత్యవతికి శతకోటి వందనాలను చెప్పుకున్నాడు. ఆమె పడుకున్న మంచం వైపు తిరిగి కాళ్ళకు నమస్కరించి ముందుకు కదిలాడు. "మీ రుణం ఏమి చేసినా నేను తీర్చలేను. భగవంతుడే మీ మంచితనాన్ని గుర్తిస్తాడు!" గద్గద స్వరంతో చెప్పాడు.

* * *

కర్రి సత్యవతికి గాజుకన్ను అమర్చారు.

ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసే రోజు వచ్చింది.

ఆమె చేసిన దానం అక్కడి సిబ్బందికి తెలిసి ఆమెపైన ప్రత్యేకమైన అభిమానాన్ని చూపించారు.

"అమ్మా! మీరు చేసిన త్యాగం చాలా గొప్పది. మీ ప్రమాదాన్ని అశ్రద్ధ చేస్తే రెండు కళ్ళూ కోల్పోయి శాశ్వత అంధత్వం వచ్చేది. కానీ మీరు మీ కంటిలో నల్లగుడ్డును దానం చేయడం వల్ల మరొకరికి కంటి చూపు వచ్చింది. మీరు శాశ్వతంగా ఒక కన్ను కోల్పోయి మరొకరికి పూర్తి చూపును ఇచ్చారు –" ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి ఆమెను అభినందించారు.

సత్యవతికి రెండు క్షణాలు ఏమి మాట్లాడాలో తెలియలేదు. తర్వాత తేరుకుని – "బాబు! నేను చేసింది త్యాగమని అనుకోవడం లేదు. నా కన్నును కోల్పోలేదు. ఆ కన్ను బతికే ఉంది, నాగేశ్వరరావు గారి ద్వారా లోకమంతా చూస్తుంది–" అంది.

"కానీ మీలా అందరూ ఆలోచించరు కదా?"

"ప్రమాదం అన్నది చెప్పిరాదు. చూపుకోల్పోవడం ఎంత బాధాకరమైన విషయమో అనుభవ పూరకంగా నాకుతెలుసు. నేను కేవలం కుటుంబానికే పరిమితమైన వ్యక్తిని. కానీ నాగేశ్వరరావు వ్యవసాయం చేసే అన్నదాత... అటువంటి అన్నదాతకు నా కన్ను దానం చేయడం సమంజసమే అనుకుంటున్నాను–"ఆమె అంది.

డాక్టర్ సుధాకర్‌రెడ్డి సిబ్బందితో చెప్పి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి సత్యవతిని అభినందించారు. తన కారును రప్పించి ఆమెను ఇంటివరకూ పంపడానికి ఏర్పాట్లు చేశారు. ఆసుపత్రి ముందు కారు డోరు తెరిచి పట్టుకుంటే సత్యవతి నెమ్మదిగా ఎక్కింది.

"సంతోషంగా వెళ్ళండి!" వీడ్కోలు పలికారు. డాక్టరు వెనుక ఇతర వైద్యులు, నర్సులు, వార్డు బాయిలు చేతులు ఊపుతూ నిల్చున్నారు.

సత్యవతి ఎడమ కంటి నుంచి అప్రయత్నంగా కన్నీళ్ళు ఉబికాయి. ఏ భావం లేని కుడివైపు గాజుకన్ను చుట్టు తడి చేరింది.

ఆసుపత్రి ఆవరణలో చెట్లు గంభీరంగా నిల్చున్నాయి.

కారు నెమ్మదిగా కదిలింది.

ఆదర్శ భర్తలు...

లక్ష్మి

(గత సంచిక తరువాయి)

"రామకృష్ణా! పాయింటుని ఊకే నొక్కమాకు! అయిందేదో అయిపోయింది!"

ఆ మాటకి రామకృష్ణ ఖంగారు పడ్డాడు ఖంగారుగానే అన్నాడు–

"అయిపోయిందంటారేంటండీ బాబాయిగారూ! ఏమీ అవ్వలేదండీ! ఏమీ అవ్వకుండానే – అంతా అయిపోయిందని మా ఆవిడ దవుటు పడుతుందని నేను దవుడు పడుతున్నాను!"

"వద్దు! నువ్వేం పడుతున్నావో నాకొద్దు అసలు విషయం చెప్పు"

"మీనాక్షికో భర్త వున్నాడండి!"

"మీనాక్షికే కాదు – ఆడవాళ్ళకెవరికైనా ఒక్కడే వుంటాడు భర్త!"

"అవునాండి! అతనేమో కొత్తగా ఏదో బిజినెస్సు పెట్టుకుంటున్నాట్ట. పదివేలు సర్దమని మీనాక్షి నాకు ఉత్తరం రాసింది!"

"పదివేలు..."

"యస్! టెన్ థవుజండ్స్!"

"అంత డబ్బు నీ దగ్గర సిద్ధంగా వుందా?"

"అంతకంటే ఎక్కువే వుంది!"

"అయితే ఇంకే? సర్దెయ్"

"ఎవరికి సర్దేవని మా ఆవిడ అడిగితేనో?"

"ఎవరికో సర్దినట్టు మీ ఆవిడకెట్లా తెలుస్తుంది?"

"నిద్దట్లో నేను కలవరిస్తాను గదా!"

"అదొకటుందా పాడలవాటు. మగవాడు కలవరించకూడదు రామకృష్ణా! కలవరిస్తే కొంపలంటుకుంటాయి!"

"అందుకే కదా! కొంపలంటుకోకుండా సలహా చెబుతారనే గదా మీ దగ్గరకొచ్చింది!"

బాబాయ్ తీవ్రంగా ఆలోచించి అన్నాడు–

"ఒక పని చెయ్"

"చేస్తా చెప్పండి"

"ఇంగ్లీషులో కలవరించు! సేఫుగా వుంటావ్!"

"మా ఆవిడకు ఇంగ్లీషు కూడా వచ్చండి"

ఆ మాటకు బాబాయ్ గారు చిరాకు పడుతూ అన్నారు–

"మరదే! నాకు మండిపోద్ది! చదువుకున్న ఆడపిల్లల్ని పెళ్ళి చేసుకోకూడదని మొన్నామధ్య పెదనందిపాడు మగాళ్ళ మహాసభలో మనవి చేసేను."

"పెదనందిపాడు మరిచిపోండి. ఇప్పుడు నన్నేం చేయమంటారు? పదివేలిచ్చేసి కలవరించేస్తే నా కాపరం ఏంగాను? చెప్పండి?"

"అయిదే పది వేలు ఇవ్వద్దు"

"ఇవ్వకపోయినా కలవరిస్తాను గదా?"

"ఏవని కలవరిస్తావు?"

రామకృష్ణ కలవరింత టైపులో చెప్పేడు–

"మీనాక్షీ! క్షమించు! నువ్వు సర్దమన్న పదివేలూ సర్దలేని అసమర్థుడ్ని మీనాక్షీ! నన్ను క్షమించు!"

"ఆపవయ్యా! వెధవ కలవరింతా నువ్వూను! ఒక పని చెయ్."

"చెప్పండి"

"నువ్వు కలవరించదలుచుకున్నదంతా కాగితమ్మీద రాసుకో! పగటిపూట మీ ఆవిడ వినేలాగ ఆ ముక్కల్ని గట్టిగా చదువుకో! ఏమిటి భాగోతమని అడుగుతుంది! నాటకం వేస్తున్నాను – అందులో అది నా పోర్షనూ – కంఠతా పడుతున్నానని కోసెయ్! నమ్ముతుంది!"

రామకృష్ణ చేతులు జోడించి అన్నాడు–

"ఆహా! బాబాయ్‌గారూ!"

"అయ్యిందా? ఆరాత్రి నువ్వు మైకులో కలవరించినా – నాటకంలో పోర్షననుకుంటుందేగాని – నీ జీవితంలో దిక్కుమాలిన చాప్టరనుకోలేదు గదా!"

"బాబాయ్‌గారూ!" అంటూ బాబాయిగారి పాదాల మీద పడిపోయేడు రామకృష్ణ. సరిగ్గా అప్పుడే వంటగదిలోంచి కంచమ్మీద గరిటతో కొట్టిన శబ్దం వినిపించింది. ఆ శబ్దం విని తలెత్తి అడిగేడు రామకృష్ణ–

"ఆ శబ్దమేమిటండీ?"

"కంచమ్మీద గరిటతో కొడితే ఆ సవుండే వస్తుంది, ఫస్టు బెల్లు"

"ఫస్టుబెల్లా!"

"అవునయ్యా! తిండికి వేళయింది. వచ్చి మింగమని మా ఆవిడ ఫస్టు బెల్లు కొట్టిందన్నమాట!"

ఇప్పుడు రెండు గంటలు వినిపించేయి. రామకృష్ణ ఖంగారుగా లేచి నిలబడి అడిగేడు–

"ఇది సెకండు బెల్లా!"

"అవును, థర్డ్ బెల్లు కూడా వుంటుంది! అప్పటికి కూడా నేను కంచమ్ముందు కూచోకపోతే – ఆ కంచాన్ని కుక్కముందు పెడుతుంది మా ఆవిడ. అంచేత – థర్డ్ బెల్లు మోగాలని కుక్కా – మోగకూడదని నేనూ ప్రతిరోజూ పోటీ పడుతుంటామన్నమాట!"

"ఎట్టి పరిస్థితుల్లోనూ కుక్కకంటే మీరే గొప్పవారు బాబాయ్‌గారూ! త్వరగా వెళ్ళండి! వెళ్ళి భోంచేయండి!"

అని రామకృష్ణ ఆ ఇంట్లోంచి బయటపడుతున్నాడు. వెళ్ళిపోతున్న రామకృష్ణను ఉద్దేశించి బాబాయ్ హెచ్చరిక చేస్తున్నాడు–

"నాటకం.... పోర్షన్... జాగ్రత్త!"

ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు.

చిత్తగించగలరు! ◆

మారిటోరియం

రుక్మిణి



జక్కులోడు రొప్పుతూ... రోజుకుంటూ చప్టామీద కూర్చున్న యాద్గిరి దగ్గరకు పరుగున వచ్చాడు.

"ఏమైందిరా.. కుక్కగాని వెంటబడిందిరా?'' యాద్గిరి బీడీ విసిరిపారేస్తూ అన్నాడు.

"అదికాదె అన్నా... మన గురివిగాడు... ఇంటి చూరుకు తాడు వేలాడదీసి 'వురి'కి సిద్ధమైపోతున్నాడు - పద... పద...!" యాద్గిరి హడావుడిగా లేచి గురివిగాడింటికి పోయేసరికి అక్కడి సీనంతా పరమ చంఢాలంగా వుంది - పొడవాటి పగ్గం చూరుకువేలాడ దీసి మరోచివరి వురి తయారు చేసి ముడి మెడకు తగిలించుకుని గురివిగాడు... వాడిపెండ్లం.. చినపోరగాండ్లు లబలబమని ఒకటే ఏడుపులు.

"యాద్గిరన్నా.. జర నువ్వయినా చెప్పవే... నా మంగళసూత్రం పుటుక్కుమంటే నాకూ... నా పిల్లలకూ గతేంటి?" ఆవిడ రోదన ఇంకా శృతి పెరిగింది.

అయితే పక్కన ఒక భారీ కాయం... బుర్రమీసాలు.. చేతుల నిండా వుంగరాలు.. ధగధగ... అప్పన్నదొర భీకరంగా చూస్తున్నాడు. ఆయనగారి పక్కన పదిమంది రాటుదేలిన గూండాలు కర్రలు, కటార్లు పుచ్చుకుని ఎర్రబారిన కండ్లతో చూస్తున్నారు.

యాద్గిరికి లీలగా విషయం అర్థమయింది. గురివిగాడు సామాన్య బక్క రైతు... పంటలు పండక.. పెట్టుబడులకు అప్పన్నదొర దగ్గర ఓ పదివేలు అప్పు తీసుకున్నాడు సరే... యాద్గిరిని చూడగానే గురివిగాడు వురి వూడబీకి స్టూలు మీద నుండి కిందికి దిగాడు.

"కక్కురా... అప్పు అణాపైసల్తో... వడ్డీతో కక్కుబే" అప్పన్న లపలప తొడలు చరిచాడు. ఆయన పదిమంది అనుచరులూ లపలప తొడలు చరిచారు. గురివిగాడు దడుసుకుని మళ్ళా స్టూలు మీదికెక్కి మెడకు వురి తగిలించుకున్నాడు.

"ఒరె యాద్గిరీ.. ఇదుగో వీడు రాసిచ్చిన అప్పు కాయితం... సంతకం.. యవసాయంలో నష్టం వస్తే నాకేంది.. నా అప్పు వడ్డీతో కక్కాల్సిందే"

"చూడు అప్పన్నా ఆర్నెల్లదాకా గవర్నమెంటు ప్రైవేటు అప్పులు.. వడ్డీలు అడగగూడదని చట్టం చేసింది. నువ్వు బలవంతం చేస్తే వాడు 'ఉరి' పెట్టుకుని చస్తాడు (గురివిగాడి పెండ్లాం పిల్లలు గోలగోలగా ఏడుపులకు తగులుకున్నారు) ఆగండెసె... (యాద్గిరి వాండ్లను గదిమాడు) చట్టాన్ని కాదంటే నువ్వు జైలుకు చుట్టం కావల్సి వస్తుంది..."

అప్పన్న ఆలోచనలో వడి తలగీక్కున్నాడు - అతడి పదిమంది సైన్యం కూడా తలవెంట్రుకలు పీక్కున్నారు - గురివిగాడు మెడవుచ్చు వూడబీకి దబాలుమని స్టూలు మీద నుండి కిందికి దూకాడు-

"అంటే తీసుకున్న అప్పులు ఎగనూకమని గవర్మెంటు ఆర్డరిచ్చిందా?" అప్పన్న సాలోచనగా అడిగాడు. పదిమంది అనుచరులు పండ్లు నూరుతూ యాద్గిరి వంకా చూస్తున్నారు.

"ఎగేయడం కాదు - ఆర్నెల్ల వరకూ అడక్కుండా - ఒత్తిడి చేయవద్దని ఆర్డరు - నీ ఇష్టం" యాద్గిరి అట్లా అనగానే అప్పన్న ఓసారి జబ్బలు చరిచాడు. పదిమంది కూడా తమ జబ్బలు చరుచుకున్నారు. గురివిగాడు అదురుకుని మళ్ళా మెడకు ఉరి తగిలించుకున్నాడు.

"సరె... ఆర్నెల్ల తర్వాతనైనా వడ్డీతో కక్కాల్సిందేగదా - గురివిగాడు డబ్బుకక్కకపోతే - నీ ప్రాణం తీస్తా... రండ్రా" అప్పన్న మీసాలు మెలిపెట్టాడు. వదిమందీ మీసాలు మెలిపెట్టుకుంటూ బయటకు నడిచారు. గురివిగాడు మెడనుండి ఉరి ఊడబీకి -దూకి దబ్బున యాద్గిరిని కావిలించుకున్నాడు - వాడి భార్య రోదనకు తాత్కాలికంగా వాయిదా వేసింది.

"యాద్గిరన్నా - ఎంతమేలు చేసినవ్... అన్నాయింగా వురేసుకుని సచ్చిపోదును-'' గురివిగాడు ఆనందంగా అన్నాడు. జక్కులోడు దీన్నంతా వినోదంగా చూస్తున్నాడు- 'సరెగాని గురివిగా నువ్వు అప్పు పత్రంలో ఏమని రాయించి అప్పు తీసుకున్నవ్ - నీ కుటుంబ అవసరాల, అక్కరల కోసం అని తీసుకుంటివి - మరి గవర్నమెంటేమో యవసాయానికి తీసుకున్న 'ప్రైవేటు' అప్పుల మీదనే ఆర్నెల్లు వేయించింది. మరినీది యవసాయం అప్పుకాదు కదా! అప్పన్నకు బుర్ర తక్కువ కాబట్టి ఈ సంగతి తెలవక పాయె - తెలుసుకుని మళ్ళా పదిమందితో నీ ఇంటిమీదకు వస్తాడు...."

గురివిగాడు దబ్బున మళ్ళా మెడకు ఉరి తగిలించుకుని స్టూలెక్కాడు - వాడి పెండ్లాం పిల్లలు మళ్ళా ఏడుపులకు తగులుకున్నారు. యాద్గిరి వాళ్ళను కసిరి గురివిగాడ్ని కిందికి దింపి ఉరి వూడబీకాడు.

"అట్లా కూకో... ఒరే - గవర్నమెంటు రైతులకు మేలు చేస్తాననడం మంచిదే. మారిటోరియం కూడా అవసరవే - అయితే బ్యాంకులోన్లూ... పేదోల్లు కూలినాలి జనాలు తిండిలేక తీసుకున్న అప్పుల మాటేమిటి? వాళ్ళు మాత్రం ఆత్మహత్యలకు తెగబడిపోరా.. ఈ చట్టంలో ఇలాంటి మార్పులు తేవాలని మన రైతులం, కూలీలుకలిసి గవర్నమెంటు మీద ఒత్తిడి తేవాలి. అంతేగాని గిట్ల చావులకు తెగబడడం చాలా దారుణం.

గురివిగాడు మెరిసే కండ్లతో వింటున్నాడు.

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అని అందరకూ తెలిసిందే. అయినా కారణాలు ఏవైనా ఏటా అంధత్వాన్ని ఆపాదించకుంటున్న వారి సంఖ్య తెలుసుకుంటే ఒకింత మనస్తాపం కలగక మానదు. రోడ్డు, కర్మాగారాల్లో ప్రమాదాలతో పాటు ఇంకా చిన్న, చితక కంటికి తగిలే దెబ్బలు, గాయాలు, వ్యాధులను పక్కన పెట్టినా, కేవలం కాటరాక్ట్ (శుక్లాలు) కారణంగానే మన దేశంలో నేటికి 1.2 కోట్ల మంది అంధత్వంతో జీవితం వెళ్ళబుచ్చుతున్నారు. వీరికి ఏటా కొత్తగా 20 లక్షల మంది తోడవుతున్నారు. వీరిలో ఏటా 16 లక్షల మందికి మాత్రమే కాటరాక్ట్ ఆపరేషన్‌లు నిర్వహించి చూపు ఇవ్వగలుగుతున్నారు. జిల్లా స్థాయిలో 'డిస్ట్రిక్ట్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ'లను ఏర్పాటు చేయడం కూడా జరిగింది. మరోవైపు నేత్రవైద్య, శస్త్ర చికిత్సా రంగాలలో ఎంతో అభివృద్ధి కూడా చోటు చేసుకున్నది. ఫలితంగానే కార్నియల్ ట్రాన్స్ ప్లాంట్ కెరటాటమి, ఇంట్రాక్యులర్ లెన్స్‌లు, లేజర్ చికిత్సలు అందుబాటులోకి వచ్చి, ఎంతోమంది రోగుల్ని అంధత్వం నుండి బయట పడేస్తున్నాయి. ముందు జాగ్రత్తల ద్వారా కంటిని రక్షించుకుంటూ, వ్యాధుల విషయంలో కాస్తంత శ్రద్ధ చూపితే ఎంతోమందిని అంధత్వం నుండి రక్షించడం పెద్ద కష్టతరం కాబోదు అంటున్నారు నేత్రవైద్య నిపుణులు. అందుకు కావల్సింది ప్రజాచైతన్యమే. కాని నేడు చాలా మంది కంటి విషయంలో ఎంతో అశ్రద్ధ చూపుతున్నారనేది సత్యదూరం కాబోదు. అందుకు అంధుల సంఖ్యే నిదర్శనం.

కంటివ్యాధుల నిర్లక్ష్యం - అంధత్వానికి మార్గం

డా॥ బి.మస్తాన్‌రావు

ఆప్తాల్‌మాలజి - పుట్టు పూర్వోత్తరాలు :

కంటి నిర్మాణం, వ్యాధులు-చికిత్సలకు సంబంధించిన అధ్యయన శాస్త్రాన్ని స్థూలంగా ఆప్తాల్‌మాలజిగా పేర్కొనవచ్చు. ఇక దీని పుట్టుపూర్వోత్తరాల విషయానికి వస్తే 1970 ప్రాంతం దాకా జనరల్ సర్జరీలో భాగంగా ఉండేది. 1944లోనే రిడ్లీ అనే శాస్త్రవేత్త ఇంట్రా అక్యులర్ లెన్స్ కనుగొన్నా, గత ఇరవై సంవత్సరాల నుండే ఆప్తాల్‌మాలజి వేగవృద్ధిని అందుకుని ప్రత్యేక విభాగంగా ఎదిగింది. క్రయోసర్జరీ, మైక్రోసర్జరీ, లేజర్‌లను ఉపయోగించడం, కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఇంట్రాక్యులర్ లెన్స్‌ల వినియోగం మొదలైనవి ఈ విభాగంలో మైలు రాళ్ళుగా పేర్కొనవచ్చు.

కంటి నిర్మాణం : కన్ను పుర్రెలోని ఆర్బిట్‌లో అమరి ఉంటుంది. ఒక్కో కన్ను అయిదు సి.సి.ల ఘనపరిమాణాన్ని, అయిదు గ్రాముల బరువును కలిగి ఉంటుంది. గోళాకారంలో కనిపించే కంటిలో, వెలుపలి నుండి లోపలికి, మధ్యలో (సెంట్రల్‌గా) నల్లగా కనిపించే భాగాన్ని కార్నియా అంటారు. దీన్నిచుట్టి కంజెంక్టివా, స్క్లీరాలు ఉంటాయి. కార్నియా వెనుకభాగంలో ఉన్న ద్రవంతో కూడిన భాగాన్ని ఏంటీరియర్ ఛాంబర్ అంటారు. దీనితర్వాత నేత్ర విభాగం లేదా ఐరిస్ ఉంటుంది. దీనిలో గల రంధ్రాన్నే కంటిపాప లేదా 'ప్యూపిల్' అంటారు. ఐరిస్ వెనుక భాగంలో పోస్టిరియర్ ఛాంబర్ ఉంటుంది. దీని వెనుక ఇడ్లీ ఆకారంలో గల కంటి కటకం అనగా 'లెన్స్' అమరి ఉంటుంది. దీనివెనుక విట్రియస్ అనే పదార్థం, రెటీనా ఉంటాయి. రెటీనా నుండి నేత్రనాడులు ప్రారంభమవుతాయి. ఇవి మెదడుతో అనుసంధానం 'దృష్టి'లో ప్రధాన పాత్ర వహిస్తాయి. కంటిరెప్పలు కంటికి రక్షణ కల్పిస్తుంటాయి.

సాధారణ కంటి సంబంధ వ్యాధులు :

సాధారణ కంటి వ్యాధులలో వైరస్ లేదా బాక్టీరియల్ కంజెంక్లివైటిస్, దృష్టి లోపాలు, కార్నియల్ ఒపాసిటీస్, గ్లకోమా (నీటికాసుల వ్యాధి) ట్రకోమా, శుక్లాలు, విటమిన్ లోపవ్యాధులు, ముఖ్యంగా విటమిన్ ఎ లోపం కారణంగా వచ్చే రేచీకటి, టెరీజియం (కొయ్యకండ పెరగడం) రెటీనల్ డిటాచ్‌మెంట్, కలర్ బ్లైండ్‌నెస్, కంటిలో నలకలు పడడం, గాయాలు అవటం, కంటిలో వచ్చే క్యాన్సర్ పుట్టుకతో వచ్చే కంటి నిర్మాణ సంబంధ లోపాలు, వ్యాధులు, డయాబెటిస్, రక్తపోటు కారణంగా కంటికి వచ్చే వ్యాధులు పేర్కొనదగినవి.



పుట్టుకతో వచ్చే కంటి నిర్మాణ సంబంధ లోపాలు, వ్యాధులు :

తల్లి గర్భంలో శిశువు పెరుగుతున్నప్పుడు సాధారణ కంటి పెరుగుదలలో ఏ కారణం చేతనైనా అసాధారణత చోటు చేసుకుంటే కంటి నిర్మాణ లోపాలు కనబడతాయి. కొన్ని కంటి సంబంధ వ్యాధులు తల్లిదండ్రుల నుండి వంశపారంపర్యంగా బిడ్డలకు వస్తుంటాయి. నిర్మాణ సంబంధ లోపం వ్యాధుల్లో మెల్లకన్ను, మయోపియా, పుట్టుకతోనే శుక్లాలు, నీటికాసుల వ్యాధులు, కన్ను చాలా పెద్దదిగా ఉండడం (మాక్రోఫ్తాల్‌మస్) లేదా చాలా చిన్నదిగా ఉండడం (మైక్రోఫ్తాల్మాస్) మొదలైనవి. వంశపారంపర్యంగా వచ్చే వ్యాధుల్లో మెల్లకన్ను, పిల్లికన్ను, క్యాన్సర్, వర్ణ అంధత్వం (కలర్ బ్లైండ్‌నెస్), బ్లూస్క్లీరీ, బుఫ్తాల్మస్, రెటినెటిస్ పిగ్‌మోటోసా, ఆప్టిక్ ఎట్రోఫి మొదలైనవి పేర్కొనదగినవి.

'కంజెంక్టివైటిస్' అంటే.. కంటిలోని కంజెక్టివా ఇన్ఫెక్షన్‌కు గురికావడాన్నే 'కంజెక్టివైటిస్' లేదా కళ్ళకలక అంటారు. వ్యాధి సోకడం వలన రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. అందువలన రక్తసరఫరా పెరిగి కన్ను ఎర్రబడుతుంది. కళ్ళ కలకలో ఎన్నో రకాలు వున్నాయి. ఏ రకమైన కళ్ళకలక అయినప్పటికీ, కన్ను ఎరుపెక్కడం, నీరు కారడం, వెలుతురును చూడలేకపోవడం అంటే ఫొటోఫోబియా మొదలైన లక్షణాలు ఉంటాయి. వైరస్ కళ్ళ కలకకు ప్రత్యేకమైన చికిత్స ఏమీ లేదు. ఈ రకం కళ్ళ కలకకు వేగంగా ఒకసారి ఆయా రకాన్ని బట్టి మందులు వాడాల్సి వుంటుంది. ఏదిఏమైనా కళ్ళకలక అంటువ్యాధి. ఇతరులకు సోకకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. రోగి వాడే టవల్స్, సబ్బు, కాటుక, జేబురుమాలు వంటివి ఇతరులు వాడకూడదు. చల్లని పరిశుభ్రమైన నీటితో కళ్ళు శుభ్రం చేసుకుంటుండాలి. కళ్లకు బాండేజి వేయకూడదు. వైద్యుని సంప్రదించడం ఎంతైనా శ్రేయస్కరం.

ఆప్తాల్మియా నియోనేటారం :

సాధారణంగా బిడ్డపుట్టిన రెండుమూడు వారాల దాకా కంటి నుండి ఎలాంటి ద్రవాలు కనిపించవు. అందుకు కారణం ఆ దశలో కన్నీటి గ్రంథులు బాగా వృద్ధి చెంది ఉండకపోవడమే. కనుక బిడ్డ పుట్టిన నెలరోజులలో కంటి వెంబడి నీరు కారటం, ఎర్రబడటం, పుసికట్టడం వంటి లక్షణాలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఇది బాక్టీరియా వలన వస్తుంది. ఈ బాక్టీరియా శిశువు కంటిలోకి ప్రసవం సమయంలో తల్లి జననేంద్రియాల ద్వారా చేరుతుంది. మొదటివారంలోనే లక్షణాలు బయటపడుతుంది. కనురెప్పలు వాయడం, కళ్ళు ఎర్రబడటం, చాలా ఎక్కువగా పుసులు కట్టడం వంటి లక్షణాలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఇది బాక్టీరియా వలన వస్తుంది. ఈ బాక్టీరియా శిశువు కంటిలోకి ప్రసవం సమయంలో తల్లి జననేంద్రియాల ద్వారా చేరుతుంది. మొదటివారంలోనే లక్షణాలు బయటపడుతుంది. కనురెప్పలు వాయడం, కళ్ళు ఎర్రబడటం, చాలా ఎక్కువగా పుసులు కట్టడం, కళ్ళు తెరవడమే కష్టమవుతుంది. దీనినే 'ఆప్తాల్మియా నియోనేటారం' అంటారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే అంధత్వానికి దారితీసే ప్రమాదం ఉంది. అసలు వ్యాధి సోకకుండా ఉండాలంటే తల్లి జననేంద్రియాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రమైన వాతావరణంలో ప్రసవించేలా చూడాలి. బిడ్డపుట్టగానే కళ్ళను గోరువెచ్చటి నీటితో పూర్తిగా తుడవాలి. వైద్యుని సలహా మేరకు యాంటిబయాటిక్ డ్రాప్స్ వేయడం ఎంతైనా మంచిది.

సాధారణ దృష్టి లోపాలు :

సాధారణ దృష్టి లోపాలలో దూరదృష్టి, హ్రస్వదృష్టి, ఎనైసోమెట్రోపియా, ప్రస్బ్యోపియా మొదలైనవి పేర్కొనదగినవి. దూరంగా ఉన్న వస్తువులు స్పష్టంగా కనిపించి, దగ్గరగా వున్న వస్తువులు స్పష్టంగా కనిపించి, దగ్గరగా వున్న వస్తువులు స్పష్టంగా కనిపించకపోవడాన్నే దూరదృష్టి అంటారు. అలానే దగ్గర వున్న వస్తువులు స్పష్టంగా కనిపించకపోవడం వలన వచ్చే దృష్టి లోపాన్ని ఎనైసోమెట్రోపియా అని, వయస్సు మీదపడిన వారిలో కంటిలోని కటకంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా వచ్చే దృష్టికి రేడియల్ కెరటాటమి అనే శస్త్ర చికిత్స లభ్యమవుతున్నది.

విటమిన్ 'ఎ' లోపానికి, కంటికి గల సంబంధం :

విటమిన్ 'ఎ' లోపం వల్ల రేచీకటి వ్యాధి వస్తుంది. అంటే రాత్రుళ్ళు కళ్ళు కనిపించవు. కంటిలోని నాడి పొరలలో రాడ్స్ అనే నిర్మాణాలు ఉంటాయి. ఇవి రాత్రిపూట దృష్టిలో ప్రధానపాత్ర వహిస్తాయి. ఇవి పనిచేయడానికి రొడాప్సన్ అనే రసాయనం అవసరమవుతుంది. ఈ రసాయనం తయారీకి విటమిన్ 'ఎ' చాలా అవసరం. విటమిన్ 'ఎ' లోపించిన వారిలో



రేచీకటి ఏర్పడుతుంది. రోగులకు తగిన మోతాదులో విటమిన్ 'ఎ' అవసరాన్ని బట్టి ఇంజక్షన్ రూపంలో, నోట్లో వేసే చుక్కల రూపంలో, ఆహారం రూపంలో అందించడం ద్వారా లోపాన్ని సరిదిద్దవచ్చు. విటమిన్ 'ఎ' లోపాన్ని అశ్రద్ధ చేస్తే కార్నియా కూడా దెబ్బతిని పూర్తిగా అంధత్వానికి గురిచేసే ప్రమాదం లేకపోలేదు. కనుక ముఖ్యంగా పిల్లల్లో విటమిన్ 'ఎ' లోపాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి సరిదిద్దడం ఎంతైనా మంచిది. ప్రస్తుతం మన దేశంలో విటమిన్ 'ఎ' లోపం కారణంగా అంధులవుతున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు.

వివిధ రంగుల కళ్ళజోళ్ళను వాడడం వలన నష్టాలు :

ఎలాంటి కళ్ళజోళ్ళు అయినా నేత్ర వైద్యుని సంప్రదించకుండా వాడడం అంత శ్రేయస్కరం కాదు. వ్యక్తులకు దృష్టిలోపాలుంటే సాధారణంగా వాడే జీరో పవర్ గ్లాసుల వలన సమస్యలు ఏర్పడవచ్చు.



ట్రకోమా వ్యాధి :

ట్రకోమా వ్యాధి 'క్లమిడియా ట్రకోమాటిస్' అనే సూక్ష్మ జీవి వల్ల కంటికి వస్తుంది. ఒకప్పుడు మన దేశంలో ఈ వ్యాధి ఎంతో మందిని అంధుల్ని చేసింది. నేడు సమర్థవంతంగా పని చేసే మందులు అందుబాటులోకి రావడంతో ఈ వ్యాధి వెనుకంజ వేసింది. ఇది ముఖ్యంగా కనురెప్పల కింద, పోలికల్స్ వంటి నిర్మాణాలను ఏర్పరుస్తుంది. కంజెక్టివాలో మచ్చలను ఏర్పరుస్తుంది. గ్లకోమానే నీటికాసుల వ్యాధి అంటారు. కంటిలోని చాంబర్స్ ఎక్వియస్ అనే ద్రవణంతో నిండి వుంటాయి. ఈ ఎక్వియస్ కంటిలోనే ఉత్పత్తి అయ్యి ప్రవహిస్తూ ఉంటుంది. ఈ ఎక్వియస్ ప్రవాహానికి ఏదైనా అవరోధం ఏర్పడితే ఆ ద్రావణం కంటిలో ఒత్తిడి కలుగచేస్తుంది. దానినే 'గ్లకోమా' అని అంటారు. సహజంగా కంటిలో సాధారణ ఒత్తిడి 15-20 మి.మి. ఉంటుంది. ఈ ఒత్తిడిని కొలిచే పరికరాన్ని 'టోనోమీటరు' అంటారు. గ్లకోమా వలన దృష్టి క్షీణిస్తుంది. చివరకు పూర్తి అంధత్వం వస్తుంది. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే కొన్ని రకాల మందుల ద్వారా శస్త్ర చికిత్సల ద్వారా, గ్లకోమా వ్యాధి నుండి దృష్టిని కాపాడుకునే అవకాశాలున్నాయి.

'కలర్ బ్లైండ్‌నెస్' అంటే...

ఎరుపు, నీలం, ఆకుపచ్చ, ప్రాథమిక రంగులలో, మూడు రంగులను కాని, ఏదో ఒక రంగును కాని గుర్తించలేకపోవడాన్ని 'కలర్ బ్లైండ్‌నెస్ అంటారు. మూడు రంగుల బ్లైండ్‌నెస్ చాలా అరుదు. సాధారణంగా ఎరుపు రంగు బ్లైండ్‌నెస్ ఎక్కువగా కనిపిస్తుంది. వివిధ వర్ణాలను విశ్లేషించే నాడి పొరలోని కోన్స్ విధి విఫలం వల్ల వర్ణ దృష్టిలోపం ఏర్పడుతుంది. ఈ వ్యాధి పుట్టకతోనే వంశపారంపర్యంగా వస్తుంది, పురుషులలోనే కనిపిస్తుంది. స్త్రీలు వాహకులుగా పని చేస్తారు. కలర్ బ్లైండ్‌నెస్‌కు ప్రత్యేక చికిత్సలు ఏమీ లేవు. వివాహితులలో జెనెటిక్స్ కౌన్సిలింగ్ ఉపయోగించవచ్చు.

దయాబెటిస్, రక్తపోటు-అంధత్వం :

అదుపులో ఉంచుకోకపోతే దయాబెటిస్, రక్తపోటు కంటిలోని రెటీనాపై ప్రభావం చూపి అంటే ఫండస్‌పై ప్రభావం చూపి, అసాధారణతకు గురి చేస్తాయి. ఫండస్‌లోని ఈ అసాధారణత అంటే రెటినల్ మార్పులు, ఎంతకాలం నుండి రక్తపోటు, షుగర్ వ్యాధి ఉన్నాయనే అంశం మీద ఆధారపడి వుంటాయి. రక్తపోటును, షుగర్ వ్యాధిని పూర్తిగా అదుపులో పెట్టుకోవడం ద్వారా రెటినల్ మార్పులను పూర్తిగా నిరోధించవచ్చు. రెటీనాలో మార్పులు వచ్చిన తర్వాత పెద్దగా చేయగలిగింది లేదు.

కంటివ్యాధుల చికిత్సలో 'లేజర్' :

కంటివ్యాధుల చికిత్సలో 'లేజర్'కు నేడు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. ముఖ్యంగా కొన్ని వ్యాధులలో శస్త్ర చికిత్సలకు ప్రత్యామ్నాయంగా లేజర్‌ను ఉపయోగిస్తున్నాము. గ్లకోమా చికిత్సలోను, కాటరాక్ట్ చికిత్సలోను, మధుమేహం కారణంగా రెటినాలో వచ్చిన మార్పుల చికిత్సలోను, హ్రస్వదృష్టికి శస్త్రచికిత్సలోను లేజర్ ఎంతగానో దోహదపడుతున్నది. నిజానికి లేజర్ అనేది ఒక ప్రత్యేక కాంతి కిరణం. అత్యంత శక్తివంతమైన ఈ కాంతికిరణం దేన్నైనా ఛేదించుకొని పోగలదు. ఈ లేజర్‌లోను ఎన్నో రకాలున్నాయి. వీటిలో యాగ్ లేజర్, ఆర్గాన్ లేజర్, ఎగ్జిమెర్ లేజర్, గ్జెనాన్ లేజర్, క్రిప్టన్ లేజర్‌లు పేర్కొనదగినవి. లేజర్ చికిత్సవల్ల రోగికి అనేక లాభాలున్నాయి. హాస్పటల్‌లో ఉండనక్కరలేదు. మందులు, శస్త్రచికిత్సలు వీలుపడినా వాటిలో కూడా లేజర్ చికిత్స ఉపయోగపడుతుంది. చాలా తక్కువ వ్యవధిలో చాలా కచ్చితంగా పనిని నిర్వర్తించవచ్చు.

కంటిలో నలకలు పడినా, గాయాలైనా చేయాల్సిన ప్రథమ చికిత్స :

కంటిలో నలకలు పడినప్పుడు కంటిని నలపకూడదు. చల్లని నీటితో శుభ్రం చేయవచ్చును. అయినప్పటికీ నలకలు పోకపోతే, నాటు, మోటు వైద్యులను ఆశ్రయించకుండా వైద్యుని సంప్రదించాలి. కంటిలో నలకలు (ఫారన్‌బాడీస్) తీసివేసేందుకు ప్రత్యేక సూక్ష్మ పరికరాలు వైద్యుల దగ్గర ఉంటాయి. గాయాలు అయినప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించాలి. కంటిలో ఏ భాగం ఏ మాత్రం దెబ్బతిందో పరీక్ష చేయించుకొని చికిత్స పొందాలి. గాయాలను నిర్లక్ష్యం చేస్తే అసలు కంటికే మోసం రావచ్చు. అంధత్వ నిరోధక విషయాలకు వస్తే ముందు ప్రతి ఒక్కరు అక్షరాస్యులై కంటి విషయంలో ఒక అవగాహన కలిగి వుండాలి. కంటిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా అశ్రద్ధ చేయక వెంటనే వైద్యుని సంప్రదించాలి. వాహన చోదకులు, కర్మాగారాల్లో పని చేసే వారు, కళ్ళకు ప్రొటెక్టివ్ గ్లాసులను వాడాలి. రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులు, వాటిని పూర్తిగా అదుపులో ఉంచుకోవాలి. ప్రభుత్వం, వైద్యులు అంధత్వ నిర్మూలనకు చేస్తున్న కృషిలో స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు పాలుపంచుకోవాలి. ప్రజాచైతన్య కార్యక్రమాలలో ఏక్టివ్‌గా పాల్గొనాలి. అప్పుడే అంధులు తగ్గిపోతారు. అంధత్వం అంతరిస్తుంది. ❖

తరాల మధ్య కట్టిన వంతెన

కొంతమంది కథకులు రాసిన కథలు జీవితాలకు కొలబద్దలు. జీవన ఫలసాయాలకు కుంచం పాత్రలు. మానవీయ అనుబంధాలను తూచిన తూనికరాళ్ళు. అందుకే ఒకోసారి మనం ఏదన్నావిన్నా... చూసినా "ఆ కథ గుర్తొచ్చింది", "ఫలానా కథలో లాగా అనిపించింది" అంటుంటాం. అంతటి సహజ కథకుల్లో ఒకరు కేతు విశ్వనాథరెడ్డి మాస్టారు. కవిత్వంలో ఎవర్రా దిట్ట అనంగానే ఓ లిస్టు చెప్తాం. అలా కవులకంటే ముందే కథకుల్లో ఓ వరస ఎప్పుడో ఏర్పడిపోయింది. సామాజికతకు కట్టుబడి ఉండే కథకులు ఏ తరానికాతరం తమదైన ప్రత్యేకతను చూపించుతూనే వున్నారు.

తాను పుట్టిన గడ్డ, తాను మాట్లాడిన యాస, తానెరిగిన జీవితాన్ని కథా సింహాసనం ఎక్కించిన రాయలసీమ 'పేదరాశి పెద్దోడు' కేతువిశ్వనాథరెడ్డి. పేదరాశి పెద్దమ్మ జానపద కథల ప్రపంచాన పీట వేసుక్కూర్చున్న ఓ అపురూపమ్మ. ఆమె తన, తన వెనుకతరాల గురించి రాబోయే తరాలకు కథల ఉగ్గు పడుతుంది. కేతు విశ్వనాథ వారి ఈ కథల సంపుటిలో ఎక్కువ కథల్లో తాత, పెద్దతాతలు... మనవడికో, మునిమనవడికో చెబుతున్న కథలు. అందుకే ఈ సంకలనం తాతల, మామ్మల తరానికీ మనవళ్ళ తరానికి మధ్యకట్టిన వంతెన. అనుబంధాల, మానవీయ సంబంధాల గట్టిరేగడి మట్టివంతెన.

1998-2003 సంవత్సరాల మధ్య రాసిన కథల సంకలనం ఇది. పన్నెండు కథల మాల. ఒక వాల్మీకి, పోలికలు, ముఖదర్శనం, స్వస్థి, మాయపొరలు, కాంక్ష, రెండు ప్రపంచాల మధ్య, అమ్మవారి నవ్వు, దగ్గరైన దూరం-దూరమైన దగ్గర, సంకటవిమోచని, పొడినిజం, విరూపం - ఇదీ ఆ 12 కథల వరుస. ఈ కథల బండిలోకెక్కిన పాఠకులను ఒకసారి రాయలసీమ పొలం గట్లెమ్మట తిప్పుతారు. ఇంకోసారి ఆ సీమ యాస భాష సొబకుల్లో విహరించవయ్యా అంటారు. మరోసారి ఫ్యాక్షన్ గొడవల వేటకొడవళ్ళు, గొడ్డళ్ళ, బాంబు ప్రేలుళ్ళ రక్తచారికలను దాటే గెంతు వేయిస్తారు.



కేతు విశనాథరెడ్డి కథలు
(1998-2003)
వెల : రు.45, పేజీలు : 116;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్నిబ్రాంచీలు.

ముదిజేజి, గూడమిద్దె, పైటేల, కవిల బావులు, సెతుర్లు మాట్లాడతాండావు, బడాశలు, సంగటి తెళ్ళె, ఎనుమూ, పాలెగాడు, చెనిక్కాయ తదితర సీమ యాస పదాల సాహిత్యవనంలోకి తీసుకొస్తాడీ కథల్రెడ్డి.

పురాణగాథల్లో వాల్మీకికి ఒక సుస్థిరస్థానం ఉంది. ఆ గాథకు సంపూర్ణ స్థాయిలో సింబాలిక్‌గా రంగశాయిపుర వాల్మీకి కథ 1998లో రాశారు. 'పోలికలు' కథ ద్వారా పాపోడు అనే మునిమనవడి తరానికి శంకయ్య ముత్తాత తరానికీ, పల్లెకీ - కార్పొరేట్ సిటీ సంస్కృతికీ పోలికలు చెప్తారు. "పల్లెటూర్లలో పనికోసం నడుస్తారు... పట్నాల్లో పొద్దుపోక నడుస్తారు... బుద్ధుల్లో" అని మార్నింగ్ వాక్‌ల పట్టణ జీవనాల్లోని శారీరక శ్రమలకు దూరమైనతనాన్ని చూపించారు. పట్టణీకరణ పొర్కుల సంస్కృతిలోని డొల్లతనాన్ని పల్లెరైతు పాత్ర ద్వారా సున్నితంగా చెప్పారు. 'ముఖదర్శనం' కథ వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారన్నట్లు శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రిగారంత పాతదే కావచ్చు. శ్రీపాద వారి కథంత సర్వజనీన సత్యమే. హైందవాచారం పేరిట ఇప్పటికీ కొనసాగుతున్న సత్యం. ఎప్పటికప్పుడు కథలోని భార్గవి లాంటి నూతన తరాలకు కొత్తదైన 'పాతది'. "నన్ను జేజి మాదిరి చెయ్యొద్దు. బొట్టు తియ్యకండి... గాజులు పగులగొట్టకండి... పూలు తియ్యకండి" అంటూ జ్వరతీవ్రతతో కలవరించే భార్గవి మాటలు, నూతన తరాలకు కేతుగారు చేర్చాలనుకున్న సందేశం. ఇదింకా సమసిపోకపోతే మరొక కథకులు చేర్చాల్సిన సందేశం కూడా. శ్రీపాదవారి కాలం నాడే ఈ వితంతు-తంతు పోయుంటే ఆ తరువాత వారు రాయాల్సిన పనిలేదు. ఇటువంటి సాంస్కృతికాంశం రేపటికీ పోకపోతే రాస్తూ ఉండాల్సిన పనేకానీ కానిపని కాదు.

"దగ్గరైన దూరం - దూరమైన దగ్గర", "రెండు ప్రపంచాల మధ్య" ఈ రెండు కథలూ ప్రవాస భారతీయ కథాంశాలు. భారతదేశ గ్రామీణ జీవనంలోని కుటుంబ సంబంధాలలో చోటు చేసుకుంటున్న అవాంఛనీయ ధోరణులను విదేశాల్లో స్థిరపడిన పాత్రలతోటి వ్యాఖ్యానం చేశారు.

"అమ్మవారి నవ్వు" జాఫర్ అనే ఒక ముస్లిం శ్రామికతనంతో, అతగాని పూల పేర్పుతో సాధ్యం చేయించారు కేతువిశ్వనాథరెడ్డి. ఓ సాయిబుతో పుష్పదేవతాలంకారాలు తీర్చిదిద్దిన పెళ్ళిమండపంలోని వియ్యాలవారు బి.జె.పి.వారు. వారి వెంట వచ్చిన సద్గురు స్వామీజీ చేత నోటమాట రాకుండా 'ఔరా' యని నోరు తెరిపించారు. కళకు, శ్రమకు కులమత భేదాల్లేవని చాటిచెప్పిన ఆ జాఫర్, ఆ పుష్పశిల్పి, అసలు పెళ్ళివేడుక సమయానికి 26 గంటల పాటు ఉపవాసంతో అలిసిపోయి గోనెసంచులపై సోయలేకుండా నిద్రపోతున్నాడు పాఠకుల్లోని మతసామరస్యాన్ని మేల్కొల్పి. "మాయపొరలు" కథలో రకరకాల 'హింసల మధ్య చర్చను నడిపినట్లు నడిపి, అన్నింటినీ ఒక గాటన కట్టడం 'కేతువిశ్వనాథరెడ్డిగారేనా ఈ పని చేసింది' అనిపిస్తుంది.

ముందు కథలు చదివి ఆ తరువాత వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారి మాటలు చదవడం బావుంటుంది. పాఠకులకు కలిగిన అభిప్రాయాలూ.. విశ్లేషకుని మాటలు సంఘర్షించుకుంటాయి. ఓ మంచి అవగాహనకు ఆ అభిప్రాయాలు పదునుదేరుతాయి. చంద్ర వేసిన రాయలసీమ ముఖచిత్రం పాఠకులను ఈ కథల మూడ్‌లోకి తీసుకెళ్ళేంత ప్రతిభావంతంగా ఉంది.

- శంకర్

శ్రీకారం



రూపాయి చెట్టు
రచన : సలీం; వెల : రు.70,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్నిబ్రాంచీలు.



సామాజిక అర్థశాస్త్రం
రచన : ఎస్.విద్యాసాగర్; వెల : రు.60,
ప్రచురణ, ప్రతులకు : విశాల సాహిత్య అకాడమి, యూనివర్సిటీ ఆఫ్ సోషల్ ఫిలాసఫీ, 2-2-186/53/5, రామకృష్ణనగర్, బాగ్‌అంబర్‌పేట్, హైదరాబాద్



అద్భుత తీరప్రాంతం

పాండిచ్చేరి

శేషు

కోరమండల్ తీరాన చెన్నయి నగరానికి దక్షిణాన 160 కిలోమీటర్ల దూరంలో గల పాండిచ్చేరి ప్రస్తుతం కేంద్రపాలిత ప్రాంతంగా ఉంది. ఈ అద్భుత తీరప్రాంతాన్ని ఫ్రెంచ్‌వారు మూడు వందల సంవత్సరాల పాటు తమ వలన ప్రాంతంగా ఉపయోగించుకున్నారు. భారతదేశాన్ని బ్రిటిష్ వారు పాలిస్తున్న రోజుల్లో దేశంలో అనేక ప్రాంతాలు ఫ్రెంచ్ వారి అధీనంలో ఉండేవి. వాటిలో పాండిచ్చేరి ఒకటి. ఇప్పటికీ భారతదేశంలో ఫ్రెంచ్ సంస్కృతికి ఒక చిహ్నంగా ఈ ప్రాంతం నిలుస్తుంది. తమిళనాడులో భాగంగా ఉన్న పాండిచ్చేరి ఫ్రెంచ్ వారి కారణంగా వందల సంవత్సరాల పాటు ప్రత్యేక సంస్కృతిని, సాంప్రదాయాలను సంతరించుకుంది. అయినప్పటికీ తమిళ భాషను, సంస్కృతిని విడనాడలేదు.

అంతర్జాతీయ ప్రాముఖ్యం గల అరవిందుని ఆశ్రమం ఇక్కడే ఉంది. ఈ ఆశ్రమాన్ని 1926లో అరవిందుడు నెలకొల్పాడు. అరవిందుని మరణం తర్వాత ఆశ్రమం ఒక ఫ్రెంచ్ వనిత ఆధీనంలోకి వచ్చింది. ఆమె నాయకత్వానే అరవిందుని బోధనలు విశ్వవ్యాప్తమయ్యాయి. మదర్‌గా కీర్తి గడించిన ఆమె 1973లో మృతి చెందారు. ఈ ఆశ్రమం పాండిచ్చేరిలో ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రదేశంగా, పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. ప్రపంచం నలుమూలల నుండి ఇక్కడికి భక్తులు, పర్యాటకులు వస్తారు. అంతేగాక దీర్ఘకాలంగా ఫ్రెంచ్ వలసగా ఉన్నందున ఇక్కడకు దేశంలో మరే ప్రాంతం కంటే కూడా ఐరోపా దేశాలనుండి పర్యాటకులు ఎక్కువగా వస్తారు.

ఇక్కడి బొటానికల్ గార్డెన్, పురాతన మ్యూజియం, దేశంలో తొలి పబ్లిక్ లైబ్రరి పాండిచ్చేరి అపురూప సంపదలుగా కాపాడబడుతున్నాయి. ఒకనాటి ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ బహుకరించిన అద్భుతమైన తైలవర్ణచిత్రం మ్యూజియంలో ఉంది. పది లక్షల లోపు జనాభా ఉండే పాండిచ్చేరి పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో ముందుడుగు వేస్తోంది.

అలంగ్‌నల్లూర్

తమిళనాడులోని మధురైకి 15 కిలోమీటర్ల దూరాన గల కుగ్రామమే అలంగ్‌నల్లూర్. అయితే అక్కడ ఏటా జరిగే వృషభపోరాటాల కారణంగా ఆ గ్రామం రాష్ట్రమంతటా ఖ్యాతి గడించింది. పంటలు ఇళ్ళకు చేరే సమయాన రైతులు పండుగ చేసుకుంటారు. ఏటా మట్టు పొంగల్ పండుగ నాడు ఎద్దులతో జరిగే పోరాటంలో విజయం సాధించినవారిని నిజమైన హీరోలుగా ప్రకటిస్తారు. ప్రపంచ ప్రఖ్యాత స్పెయిన్ బుల్‌ఫైట్‌లో మాదిరిగా ఇక్కడి పోరాటయోధుల చేతుల్లో ఏమీ ఉండవు. ఒట్టి చేతులతోనే పోరాడతారు. ఎద్దు మెడలో బంగారు ఆభరణాలు, కరెన్సీ కాగితాలు పొదిగిన ఒక సిల్క్ వస్త్రాన్ని వేస్తారు. ఎవరైతే ఆ వస్త్రాన్ని ఊడబెరుకుతారో అందులోని నగలు, డబ్బు అతనికే ఇచ్చి హీరోగా ప్రకటిస్తారు. ఏటా ఈ పోటీలో అనేకమంది గాయపడటం, అరుదుగా మృతి చెందడం కూడా జరుగుతుంది. తమిళనాట భూస్వాములు ఈ పోటీలు నిర్వహించడాన్ని తమ హోదాకు చిహ్నంగా భావిస్తారు. రాష్ట్రం నలుమూలలా అనేకమంది ఎద్దులను చిన్నప్పటినుండి ఈ పోటీలకోసమే ప్రత్యేకంగా పెంచుతారు. రక్తపాతం సృష్టిస్తున్న ఈ పోటీలను కొన్ని సంవత్సరాల క్రితం తమిళనాడు ప్రభుత్వం నిషేధించింది. అయితే అన్ని వైపుల నుండి వచ్చిన వత్తిడితో కొన్ని జాగ్రత్తల నడుమ మరలా పునరుద్ధరించారు. రెండు మూడెకరాల స్థలంలో ప్రత్యేక ఫెన్సింగ్ వేసి ఈ పోరాటాలు నిర్వహిస్తారు. చుట్టూ వేలాదిమంది దాన్ని వినోదంగా చూస్తారు. ✥



గుజరాత్ దాడులను బోనెక్కించిన 'సాటెరో జులై'



శంకర్

సమకాలీనతను రచనలో పొందుపరిచిన రచయితలు పాఠకులకు అజ్ఞాతంగా ఉంటారు. సినిమాకరించిన వారు ప్రేక్షకుల సమక్షంలో ఉండరు. రంగస్థలం మీద నాటికీకరించిన వారి స్థితి అలా కాదు. ప్రేక్షకుల కట్టెదుట ప్రత్యక్షంగా ఉండి వారి పొగడ్తకో, తెగడ్తకో అందుబాటులో ఉంటారు. సమకాలీనంపై వ్యాఖ్యానించడమే నిప్పుల నడక. అలాంటిది దృశ్యరూపంలో వ్యక్తం చేయడం కత్తి 'పదును' మీద నాట్యం చేయడం లాంటిది. బెంగాలీ నాటకకర్త బ్రాత్యాబసు సమకాలీనం అనే కత్తి పదును మీద జారుడుబండ ఆట ఆడాడు. గుజరాత్ దాడులపై న్యాయ విచారణ చేయడానికి రంగస్థలాన్నే కోర్టుగా మలిచారు బ్రాతాబసు.

బ్రాతాబసు గణక్రిష్టి థియేటర్ గ్రూప్‌కి చెందిన డైరెక్టర్. ఆయన తన ప్రెసిడెన్సీ కాలేజీ రోజుల్లోనే ఔత్సాహిక నటుడుగా, దర్శకుడుగా రంగప్రవేశం చేశారు. సామాజిక సమస్యలకు రాజకీయ విశ్లేషణ జోడించి చూపడం అంటే ఈయనకు చాలా ఇష్టమైనది. 1990లలో ఈ గణక్రిష్టి సంస్థలో చేరినప్పటి నుండీ "అషాలిన్' 'అరణ్యదేవ్', 'వింకిల్ ట్వింకిల్', 'వైరస్-ఎమ్' లాంటి సీరియస్ స్క్రిప్టుల నాటకీకరణలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం జులై 17న 'నాట్యఉత్సవ్'ను నిర్వహించారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో నిర్వహించిన ఈ నాట్య ఉత్సవ్‌లో కొల్‌కతా, బాలుర్‌ఘాట్, కళ్యాణీ, భోపాల్, నాగపూర్, ఢిల్లీల నుంచి వచ్చిన బృందాలు తన కళారూపాల్ని ప్రదర్శించారు. నాగపూర్ బృందం ప్రదర్శించిన 'అవుర్ ఏక్ ద్రోణాచార్య', లక్ష్మీ చంద్రశేఖర్ ప్రదర్శించిన ఏకపాత్రాభినయం 'సింగరేవా అండ్ ది పాలెస్' మంచి ప్రభావాన్ని ప్రదేశాయి. ఆ నాట్యకోత్సవ్ వేదికపైనా గణక్రిష్టి థియేటర్ గ్రూప్‌వారు గుజరాత్‌లో జరిగిన దారుణ మతోన్మాద హింసాకాండపై రూపొందించిన 'సాటెరో జులై' ప్రదర్శించారు.

2002 ఫిబ్రవరి 27న గోద్రా స్టేషన్ ఎదుట కొద్దిదూరం వెళ్ళిన సబర్మతీ ఎక్స్‌ప్రెస్‌లో ఎస్-6 భోగీ దగ్ధం అయ్యింది. ఈ గోద్రా దుర్ఘటన పేరిట ఫిబ్రవరి 28, మార్చి 1, 2 తేదీలలో మూడురోజుల పాటు పథకం ప్రకారం జరిగిన "మోడీ డిజైన్డ్ హత్యాకాండ" చరిత్రలో మచ్చగా మిగిలిపోయిన 'గుజరాత్ గాయం'. గోద్రా రైలు భోగీ దగ్ధం అవ్వడానికి ఆరునెలల ముందే ఉద్రేకర ఉపదేశ సహిత శిక్షణ సంఘపరివార్ మతోన్మాద శక్తులు పూర్తి చేసుకున్నాయి. వారి బీభత్సరస నృత్యకేళిలో మరణించిన వారు, లైంగిక దాడికి గురైన వారు కాక లక్షాడెభ్భై వేలమంది ముస్లింలు శరణార్థులయ్యారు. ఈ దుస్సంఘటన వ్యాసాలు, కథలు, కవితలు రిపోర్టులు, పరిశీలనలు, డాక్యుమెంటరీలు ఇన్ని రూపాల్లో నమోదయ్యింది. నాటకకళ కూడా ఈ గుజరాత్ గాయాన్ని దృశ్యరూపం చేసింది. ప్రజానాట్యమండలి, ప్రజాకళామండలి, అరుణోదయ లాంటి ఉద్యమ కళా సంస్థలు మన రాష్ట్రంలో నాటకీకరించాయి.

ఈ గోద్రానంతర గుజరాత్ దాడుల నేపథ్యంలో కొల్‌కతాలో జులై 17న ప్రదర్శించిన ఈ 'సాటెరో జులై' నాటిక 40 మంది నటీనటులతో ప్రదర్శించారు. దీనిలో ఒక ప్రధాన నటుడు పిజుష్ గంగూలీ ఈనాటిక కోసం ఒక కొరియోగ్రాఫర్ వద్ద శరీరకాభినయం, నృత్యంలో కష్టతరమైన శిక్షణ పొందాడు. ఎన్నికలకు చాలా ముందే ఈ నాటిక రిహార్సిల్స్ ప్రారంభించారు. ఆ రిహార్సిల్స్ చూసిన కొందరు 'ఈ నాటికలోని కథాంశం కేంద్రంలో పాలకవర్గాన్ని మార్చేంతగా ప్రభావం పడేస్తుంది' అని అన్నారు. అయితే బసు ఏమంటారంటే "ఈ నాటికలో దృశ్యం చేసిన గోద్రానంతర గుజరాత్ సన్నివేశాలు రాజకీయాలు మతాన్ని ఎలా వక్రీకరిస్తాయో తెలియజేసే నిశితమైన దృష్టికోణం అందిస్తుంది" అని అంటారు.

అదొక కోర్టు లాగా పొందుపరచబడ్డ దృశ్యం. ఉద్రేకపూరిత ప్రయోగంలోని గుజరాత్‌ను నేపథ్యంగా వేసిన తెర. మనిషిని, మానవత్వాన్ని బోనెక్కించారు. మతోన్మాద శక్తులతో కిక్కిరిసిన గదిలో వాద ప్రతివాదాల హోరు. ఆ వాగ్వివాదాల మధ్య చిక్కి చితికిపోతున్న నిజాయితీ. సామాజిక ఉత్పాతాల సుడిగుండాల్లోకి తోసివేయబడుతున్న సామాన్యులు... వారి హాహాకారాలు. గుండెలు పిండేసే సంఘటనల క్రమంతో ఆలోచనల పీఠం ఎక్కిస్తుంది నాటకం. మన దేశ నాటకరంగంలోనే బెంగాల్ నాటక ప్రక్రియ కళాత్మకంగా ఎంతో పరిణితి చెందింది. ప్రయోగాత్మకతలోనూ ముందుంది. తాత్వికమైన ఆలోచనాధారానందిస్తూనే ఆర్తిని నింపే దృశ్యాలను ప్రదర్శించుతుంది. అలాంటి శక్తివంతమైన రూపకల్పనతో బ్రాత్యాబసు ఈ 'సాటెరో జులై' నాటకం తయారు చేశారనిపిస్తుంది. ❖

కలం కలత

కలం కదలటం లేదు
మనో బలం కలగటం లేదు
చదువుకున్న వాళ్ళ కంటే -
చదువు'కొన్న' వాళ్ళకు వేసే ముందు పీటను చూచి-
వస్తువుకు రూపాయి గిట్టుబాటు ధరను రైతుకు చెల్లించి
వినియోగదారుడి వద్ద
అదే వస్తువుకు పదిరూపాయలు వసూలు చేసే దళారిని
చూచి
ఆయుధాల తయారీ - యుద్ధాల ఫిక్సింగ్-
మూతపడ్డ ఫ్యాక్టరీ, దివాలెత్తిన బాంక్, బోర్డు తిప్పిన
చిట్‌ఫండ్స్
రోత కల్గించే ఆస్పత్రి, శివాలెత్తే చౌకడిపో డీలరు, లార్డులా
చేయిచాపే లంచగొండులు
కాతకాయని మామిడితోట, సాహసం తెచ్చిన తాగుడు,
యార్డు దాకా రాని పంటలు
నేతలు చేసిన అప్పుల కుప్పలు, చావాలనిపించే ఆర్థిక
స్థితి బర్దువ్యాలో భవిష్యత్తు
ఇలా -
వేతల మధ్య మగవాళ్ళని, సవాలక్ష సమస్యల మధ్య
ఆడవాళ్ళని చూచి-
చూచి, చూచి-

కలం కదలటం లేదు
మనోబలం కలగటం లేదు.
ప్రకృతి చిత్రం!
గత చిత్రాలెన్నో ముందుగా కదిలాయి - చిత్రాలను
కదిలించాయి
శ్రీశ్రీ, మయకోవస్కీ, నజ్రుల్ ఇస్లాం, పాబ్లోనెరుడా...
కవుల
గీతాలెన్నో విన్పించాయి కర్తవ్యాన్నే బోధించాయి
మడమ తిప్పని ప్రజాందోళన, వెనక్కు మళ్ళని పోరాట
పటిమ
తరతరాలు మిగిల్చిన సమభావపు సంఘర్షణలెన్నో -
కణకణమండే జ్వాలలై ఎగిసాయి
గణగణమోగే రావాలై ప్రతిధ్వనించాయి.
కలం కదిలింది మళ్ళీ క్రౌర్యంపై కదనానికి
మనోబలం కలిగింది మళ్ళీ దౌర్జన్యంపై దండయాత్రకు
మరోసారి శ్రమశక్తులేకమైనాయి -
సమసమాజ స్థాపన కోసం!
ఏకధ్రువ ప్రపంచదోపిడీదారుడిపై సమరం కోసం!!

- డా॥ నాగినేని భాస్కరరావు

(9వ పేజీ తరువాయి)

చేసయినాసరే నాబిడ్డను నేను దక్కించుకుంటాను" అంటూ శపథం చేస్తున్నదానిలా దీక్ష బూని కూర్చుంది, శ్రీలక్ష్మి.

ఈలోగా కొందరు ఆందోళనకారులు, పత్రికా విలేకర్లు, ఫోటో గ్రాఫర్లు, టి.వి వీడియో గ్రాఫర్లు అక్కడకు చేరుకున్నారు, ఎవరి కార్యక్రమంలో వాళ్ళున్నారు. విలేకర్లు వార్తలు వ్రాసుకుంటున్నారు. ఒకవైపు ఫోటోలు, మరోవైపు వీడియోలు తీస్తున్నారు, ఇంకోవైపు ఆందోళనకారులు డాక్టర్‌ను సస్పెండ్ చేయాలి!... శ్రీలక్ష్మికి న్యాయం జరగాలి'...'డాక్టర్ బయటికి రావాలి' అంటూ నినాదాలు చేస్తున్నారు. ప్రజానంఘాలు నిజానిజాలు తెలుసుకుంటున్నాయి.

శ్రీధర్ ఇక అక్కడ ఉండటం క్షేమం కాదని పిల్లిలా తప్పించుకొని వెళ్ళిపోయాడు.

శ్రీలక్ష్మితో మాట్లాడి అన్ని విషయాలు తెలుసుకున్న విలేకర్లు లోపలికెళ్ళి డాక్టర్ దేవానందంను కలిశారు. ఆమెకు జరిగిన అన్యాయం గురించి అడిగారు.

"ఆమె చెప్పేది నిజం కాదు. ఆమెకు మగపిల్లాడే జన్మించాడు. భర్తకూడా ఎలాంటి అభ్యంతరం తెలపడం లేదు. మీరు ఈ విషయం గమనించాలి" అంటూ డాక్టర్ వివరణ ఇచ్చాడు.

ఏమాత్రం తేడాలు రాకుండా విలేకర్లు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి పంపించాడు డాక్టర్.

శ్రీలక్ష్మి చెప్పిన ఆధారాల ప్రకారం ఆమెకు నిజంగా ఆడపిల్లే పుట్టిందని అందరూ నిర్ధారించుకున్నారు. మరయితే ఆ పిల్ల ఏమైనట్టు? ఈ మగబిడ్డకు తల్లెవరు? ఆ తల్లి తన బిడ్డను ఎలా ఇచ్చింది?

...ఇవన్నీ ఆలోచిస్తుంటే ఈ హాస్పిటల్‌లో పెద్ద ఎత్తున మోసాలు జరుగుతున్నాయని, పసి పిల్లల అమ్మకం కుంభకోణంలో ఈ డాక్టర్ కూడా ఉన్నాడనే అవగాహనకొచ్చారు.

మరుసటిరోజు ఉదయం శ్రీలక్ష్మికి జరిగిన అన్యాయం గురించి అన్ని దినపత్రికల్లో ఫోటోలతో సహ పెద్ద ఎత్తున వార్తలొచ్చాయి, టి.వి వార్తల్లో కూడా ఈ సంఘటన ప్రముఖంగా చోటు చేసుకొని సంచలనం సృష్టించింది.

దీక్షలో కూర్చున్న శ్రీలక్ష్మికి ఆమె తల్లి, అన్నయ్యలు మొదట మనోధైర్యాన్ని, ఆ తర్వాత ఓదార్పు ఇస్తున్నారు. ఆమెకు మద్దతుగా ఇంకా చాలామంది మహిళలు తోడయినారు.

మూడురోజులు గడిచాయి. శ్రీలక్ష్మికి జరిగిన అన్యాయం గురించి ఆమెకు న్యాయం చేయాలని రాజకీయ పక్షాలు, సామాజిక సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాయి.

జరుగుతున్న పరిణామాలకు ప్రభుత్వంపై వస్తున్న విమర్శలకు సంబంధిత మంత్రి స్పందించారు. వెంటనే ఉన్నతాధికారులతో సమావేశమై సి.ఐ.డి విచారణకు ఆదేశించారు.

సి.ఐ.డి. అధికారుల బృందం ముగ్గురు విడిపోయి ఒకే సమయంలో విచారణ కొనసాగించారు.

ఒక అధికారి శ్రీధర్ పని చేస్తున్న ఆఫీసుకెళ్ళి అతనితో మాట్లాడి, డాక్టర్ తీసిన స్కానింగ్ రిపోర్టు పరిశీలించాడు.

మరో అధికారి డాక్టర్‌ను కలవడానికి వచ్చాడు.

"డాక్టరు! శ్రీలక్ష్మి డెలివరీ సందర్భంగా

ఆడపిల్ల

ఇతరులెవరయినా డెలివరీకి వచ్చారా? దానికి సంబంధించిన రికార్డులు చూపండి" అని అడిగాడు సి.ఐ.డి అధికారి.

"అలాగే తప్పకుండా" అంటూ రికార్డు చూపించాడు తడబడుతూ డాక్టర్.

"ఆ సందర్భంగా డిశ్చార్జి ఎవరయ్యారు?"

"కంసలి"

"ఈమె ఎవరు? ఎక్కడుంటారు?"

"రాణి పేటలో"

"ఆమెకు జన్మించింది ఆడపిల్లా? మగ పిల్లాడా?"

"ఆడపిల్ల" తడబడుతూనే అన్నాడు డాక్టర్.

హాస్పిటల్‌లోని మిగతా సిబ్బందిని కూడా విచారించారు.

కంసలి అడ్రసు వెతుక్కుంటూ వచ్చాడు సి.ఐ.డి. అధికారి. అతన్ని చూసి కంసలి కొంత భయపడినా తమాయించుకుంది.

"నీ పేరు కంసలా?" అడిగాడు సి.ఐ.డి. అధికారి.

"అవును సారు"

"నీకు వారం రోజుల క్రింద బిడ్డ జన్మించింది కదా..ఏది?"

"అదా.. అదీ మా అమ్మవాళ్ళు తీసుకెళ్ళారు సారు"

"ఎందుకు?"

"ఎందుకంటే...నాకు పాలు లేవు కదా! పేదదాన్ని.. పని చేసుకుంటేనే బతుకెల్లేది.. మా అమ్మ పెంచుతానని తీసుకెళ్ళింది సారు"

తడబడుతూనే అంది కంసలి

"మీ అమ్మ ఎక్కడుంది?"

"బంజరతండ"

ఆ తండ ఎక్కడుందో ఎలా వెళ్ళాలో వివరాలు తీసుకొని బయలుదేరాడు సి.ఐ.డి. అధికారి.

ఇంకో అధికారి శ్రీలక్ష్మిని కలిసాడు.

"లక్ష్మిగారు నేను సి.ఐ.డి ఆఫీసర్‌ని. మీరు ఏదీ దాచకుండా పూర్తి వివరాలు చెబితే మీకు తప్పకుండా న్యాయం జరుగుతుంది" సముదాయింపుగా అడిగాడు.

"తప్పకుండా సర్" అన్నది శ్రీలక్ష్మి ఆశగా.

"మీ భర్తతో మీకు ఏమైనా గొడవలున్నాయా?"

"లేవండి"

"మీకు జన్మించిన బిడ్డను మీ భర్తే మార్పించాడని ఎందుకను కుంటున్నారు?"

"వారికి ఆడపిల్లలంటే అసలు ఇష్టం లేదు"

"ఇంకా ఏ ఆధారాలతో అనుమానిస్తున్నారు?"

మాయ మాటలు చెప్పి స్కానింగ్ తీయించిన విషయంతోపాటు జరిగిన కథంతా పూసగుచ్చినట్లు వివరించింది శ్రీలక్ష్మి.

ఇక నువ్వు నిర్భయంగా ఉండమ్మా. ఆందోళనపడకు. నీకు న్యాయమే జరుగుతుంది" అంటూ ఆత్మస్థైర్యాన్నిచ్చి అక్కడి నుండి బయలు దేరాడు సి.ఐ.డి. ఆఫీసర్.

డాక్టర్‌ను, కంసలిని, శ్రీధర్‌ను సి.ఐ.డి.వారు కస్టడీలోకి తీసుకొని ఇంటరాగేట్ చేయడం మొదలుపెట్టారు.

వాస్తవ సమాచారంతో సి.ఐ.డి. అధికారులు నిలదీయటంతో ఇక తప్పించుకోవటం కుదరదని నిజాలు మొత్తం కక్కి ముగ్గురూ తప్పు ఒప్పుకున్నారు.

ముందుగా ఆ బిడ్డను దీక్షలో కూర్చున్న తల్లికి అప్పగించి ఆమెను దీక్ష నుండి లేపారు.

శ్రీలక్ష్మి ఆనందానికి అంతులేదు బిడ్డను తీసుకొని తన్మయత్వంతో ముద్దాడి పాలు పట్టింది.

తన బిడ్డను తనకు ఒడి చేర్చినందుకు శ్రీలక్ష్మి అందరికీ కృతజ్ఞతలు తెలిపింది. తన బిడ్డను తీసుకొని ఆమె తన తల్లి, అన్నయ్యలతో ఇంటికి చేరుకుంది.

ఒక ఆడదాని శక్తికి ఊరూ వాడా, సమాజం ఏ విధంగా కదిలిందో శ్రీధర్ ఆలోచనల్ని కూడా అలా కదిలించాయి. స్త్రీ ఆర్తనాదాలకు ఎలా న్యాయం జరిగిందో ప్రత్యక్షంగా అనుభవం కల్గింది. శ్రీధర్‌కు జ్ఞానోదయం కల్గింది.

విడాకుల కొరకు ఇప్పించిన నోటీసును వాపస్ తీసుకొని శ్రీలక్ష్మిని ఇంటికి తీసుకెళ్ళడానికి వచ్చాడు శ్రీధర్.

"జరిగిన దానికి సిగ్గుపడుతున్నాను, నన్ను అర్థం చేసుకోవాలని ఇంత కాలం నేను రాలేదు. నాకు ఇప్పుడు ఎంతో ఆనందంగా ఉంది" అంటూ మనసులోని మాట చెప్పింది శ్రీలక్ష్మి.

శ్రీలక్ష్మి, శ్రీధర్ అదేరోజు వాళ్ళింటికి చేరుకున్నారు. ఉద్యోగం నుండి సస్పెండయిన మరుసటి రోజే శ్రీధర్‌ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు అధికారులు.

"శ్రీలక్ష్మి ఇంట అడుగు పెట్టగానే శుభం జరిగిందని" ఆనందిస్తూ "ఈ మహాలక్ష్మి వలన నాకు జ్ఞానోదయం కలిగిందని" తనబిడ్డ 'లయ'ను ఎత్తుకొనిముద్దాడుతూ "మనకు మళ్ళీ ఆడబిడ్డే కావాలి లక్ష్మీ" అంటూ శ్రీలక్ష్మిని దగ్గరకు తీసుకున్నాడు శ్రీధర్.

ADVOCATE న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

ఎలా రాసుకుంటే అలా నడుచుకోవాలి

నేను, మా అన్న కలిసి 1979 సంవత్సరంలో ఒక స్థలం కొన్నాం. ఈ స్థలం మా ఇద్దరి పేరున రిజిస్ట్రేషన్ అయ్యింది. ఈ స్థలంలో మా అన్న కుడిపక్క ఇల్లు కట్టుకున్నాడు. ఇంటి నెం. *V*-44 నేను ఎడమ పక్క ఇల్లు కట్టుకున్నాను. ఇంటినెంబరు *V*-45 1991 సంవత్సరంలో మేము ఇద్దరం ఒక విభజన పత్రం రాసుకున్నాం. దానిని రిజిస్ట్రేషన్ చేయించలేదు.

విభజన పత్రంలో వివరాలు : *V*-44 నెంబరు ఇంట్లో క్రింద భాగం మా అమ్మ ఉండడానికి మా అమ్మ బాధ్యత కూడా తీసుకోవడానికి ఒప్పుకోని నా దగ్గర డబ్బు తీసుకొన్నాడు. *V*-44 పై భాగం మా అన్న అతని భార్యా ఉండడానికి ఒప్పుకున్నాడు. మా అన్న జయరాంకు పిల్లలు లేరు. *V*-45 నెంబరు ఇంట్లో నేను ఉండాలని, నా పిల్లలు ఉండాలని నిర్ణయించుకున్నాం.

2003 సంవత్సరంలో మా అన్న జయరాం చనిపోయాడు. ఇప్పుడు 1991 సంవత్సరంలో రాసుకున్న విభజన పత్రం ప్రకారం మా అమ్మ *V*-44 క్రింద భాగం ఆమె తన మనవలకు రాసి ఇవ్వచ్చా? ఆమె బాధ్యత నా బిడ్డలు చూస్తున్నారు.

V-45 నెంబరు గల ఇంటిని నేను నా భార్యకు, బిడ్డలకు రాసి ఇవ్వడానికి, రిజిస్ట్రేషన్ చేయడానికి ఎవరు అనుమతి అవసరం లేదు కదా? దాని గురించి నాకు ఎటువంటి సమస్యలు వస్తాయో దానికి మీ పరిష్కారం తెలియచేయగలరు.

1991 సంవత్సరం రాసుకున్న విభజనపత్రం ప్రకారం ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయడానికి వీలువుతుందా?

- ఒక పాఠకుడు

మీరు మీ అన్నగారు 1979లో జాయింట్ రిజిస్ట్రేషన్ అన్నారు. మీ విభజన పత్రం ప్రకారం మీ అమ్మగారు ఉన్న పోర్షన్ జీవితాంతం ఉండి అనుభవించడానికేనా లేదా తన ఇష్టానికనుకూలంగా దాన, క్రయ విక్రయాలు కూడా చేసుకోవచ్చని రాసుకున్నారా తెలుపలేదు. ఆ విభజన పత్రంలో ఎలా రాసి ఉంటే అలా నడుచుకోవాల్సి ఉంటుంది. మీ ఇరువురిది జాయింట్ రిజిస్ట్రేషన్ కాబట్టి మీ అన్నగారి వారసురాలుగా మీ వదిన గారి సమ్మతితో మీరు మీ వారల మీద రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది

వయోపరిమితి దాటింది సలహా ఇవ్వగలరు

1991 జనాభా లెక్కల సేకరణలో పని చేసిన వారిని గవర్నమెంట్ సర్వీసులోకి తీసుకోవలెనని ప్రొవిజన్ ఉన్నందున పలుమార్లు కలెక్టర్, సెక్రటరీ, సి.ఎం.లకు పిటిషన్లు పెట్టుకున్నాను. అయినా ఎలాంటి స్పందనా రాలేదు. హైకోర్టుకు వెళ్ళాను. చీఫ్ సెక్రటరీ తిరస్కరించారు. నాకు 1995 వరకు ఏజ్ లిమిట్ దాటిపోయింది. ఇప్పటివరకు కూడా నా బీద పరిస్థితి వివరిస్తూ అన్ని స్థాయిల అధికార్లకు ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినా ఫలితం కనిపించటం లేదు. ఇప్పుడు నా పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. నేనేం చేయాలో దయచేసి న్యాయసలహా ఇవ్వగలరు.

- గడ్డం రాజయ్య, సదాశివనగర్, నిజామాబాద్ జిల్లా

మీరు పంపించిన పేపర్లు పరిశీలించగా మీరు 1991 జనాభా లెక్కల సేకరణలో పాల్గొన్నారని తెలిపారు. వాటిల్లో పాల్గొన్న వ్యక్తులను ప్రభుత్వ, కార్పొరేషన్ సర్వీసుల్లోకి తీసుకోవాలి అని ప్రొవిజన్ వుందన్నారు. ఆ ప్రొవిజన్‌లో ఎలాంటి కండిషన్స్ ఉన్నాయో తెలుపలేదు. దాంట్లో ఏమైనా కండిషన్స్ ఉంటే దానికి సరిపోయేటట్లు మీకు క్వాలిఫికేషన్ ఉండి ఉంటే హైకోర్టులో రిట్ వేయాలి. మీ విషయంలో హైకోర్టు ఆర్డర్ ఉందన్నారు. ఆ కోర్టు ఆర్డర్‌లో ఏముందు తెలుపలేదు. ఆ తర్వాత కూడా మీ పిటిషన్లను తిరస్కరించారన్నారు. అంటే మీకు కోర్టులో వచ్చిన ఆర్డర్ మీకు అనుకూలంగా వచ్చి ఉండకపోవచ్చు. మళ్ళీ మీరు ఫ్రెష్‌గా చీఫ్ సెక్రటరీకి రిప్రజెంటేషన్ పెట్టారు. దీనిని తగు చర్య నిమిత్తం కలెక్టర్ గారికి పంపారు. కాని మీకు ఉద్యోగం ఇవ్వమని ఏమీ చెప్పలేదు. మీరు కలెక్టర్‌నే సంప్రదించండి. మీకు తగు విధంగా ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించే ప్రొవిజన్ ఉంటేనే కోర్టును ఆశ్రయించండి. లేదంటే కలెక్టర్ గారిని కలిసి మీ పరిస్థితి వివరించండి.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

రుచి

సేమ్యా కొబ్బరి లడ్డూలు

కావలసిన వస్తువులు:

సేమ్యా	: పావు కేజి
కొబ్బరి	: పావు కేజి
పంచదార	: అర కేజి
నెయ్యి	: వంద గ్రాములు
జీడిపప్పు	: 50 గ్రాములు
ఏలకులు	: 10
కిస్మిస్	: 10 గ్రాములు

తయారుచేసే విధానం:

సేమ్యాను ముందుగా రెండు స్పూన్లు నెయ్యి వేసి దోరగా వేయించుకోవాలి. కొబ్బరి తరుముకోవాలి. కొబ్బరి తురుమును కూడా కొంచెం నెయ్యివేసి లైట్‌గా వేయించాలి. జీడిపప్పు, కిస్‌మిస్ కూడా నేతిలో వేయించుకోవాలి. ఏలకులు పొడి చేసుకోవాలి. పంచదారను మిక్సీలో మెత్తగా పిండిలాగా వేసుకోవాలి. అలాగే సేమ్యాను కూడా మిక్సీలో వేసి పొడి చెయ్యాలి. వీటన్నింటిని బాగా కలుపుకోవాలి. మిగిలిన నేతిని వేడి చేసి ఈ మిశ్రమంలో పోసి బాగా కలపాలి. చిన్న చిన్న లడ్డూలుగా చేసుకోవాలి. ఇవి చాలా తొందరగా అయిపోతాయి. చేసుకోవడం చాలా తేలిక. చాలా రుచిగా కూడా ఉంటాయి.

నువ్వుల కిచిడీ

కావలసిన వస్తువులు:

బియ్యం	: రెండు కప్పులు
పెసరపప్పు	: అర కప్పు
నువ్వులు	: 50 గ్రాములు
ఎండుకొబ్బరి తురుము	: పావు కప్పు
ఎండు మిరపకాయలు	: 5
దాల్చినచెక్క	: 2 చిన్న ముక్కలు
లవంగాలు	: 4
ఏలకులు	: 2
జీలకర్ర	: అర టీ స్పూను
మిరియాలు	: అర టీ స్పూను
ఉల్లిపాయ	: పెద్దది
అల్లం వెల్లులి పేస్ట్	: అర టీ స్పూను
పసుపు	: అర టీ స్పూను
ఉప్పు	: తగినంత
నెయ్యి లేక నూనె	: అర కప్పు
పుదీనా ఆకులు	: పావు కప్పు

తయారుచేసే విధానం:

ఉల్లిపాయను పొడవు ముక్కలుగా కోసుకోవాలి. నెయ్యి లేదా నూనెను వేడి చేసి అల్లం-వెల్లుల్లి పేస్టు వేసి వేయించాలి. ఉల్లిపాయ ముక్కలు కూడా వేసి వేయించాలి. లవంగాలు, ఎండుకొబ్బరి తురుము, అన్ని మసాలా దినుసులు, ఎండుమిరపకాయలు, నువ్వులు కొంచెం వేడి చేసి పొడి చేసుకోవాలి. ఉల్లిపాయముక్కలు వేగాక మసాలా పొడి, పుదీనా ఆకులు, బియ్యం, పప్పు, పసుపు, ఉప్పు వేసి ఒక నిమిషం వేపాలి. కప్పు బియ్యానికి రెండు కప్పుల నీళ్ళు చొప్పున పోయాలి. అన్నం ఉడుకు పట్టగానే స్టవ్ తగ్గించి మూతపెట్టి ఉడికించాలి. ఘుమఘుమ లాడే నువ్వుల కిచిడీ రెడీ.



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఎంచక్కా ఒక పోస్ట్ కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే.

మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : బి.భారతి
వయసు : 8 సం॥
చదువు : 3వ తరగతి
హాబీలు: చదువుకోవడం, టీవీ చూడటం, ఆటలు ఆడటం, డ్రాయింగ్ వేయడం.
లక్ష్యం: కలెక్టర్ కావడం.
చిరునామా:
బి.భారతి, డాటరాఫ్ శ్రీనివాసరావు,
డోర్ నం: 30-20/2-20,
గీతా మందిరం వీధి, చుట్టుగుంట,
విజయవాడ.

పేరు : ఎ.అఖిల్
వయసు : 9 సం॥
చదువు: 4వ తరగతి
హాబీలు: చెస్, క్రికెట్ ఆడటం, బొమ్మలు గీయడం.
చిరునామా:
ఎ.అఖిల్,
4వ తరగతి,
ఢిల్లీ పబ్లిక్ స్కూల్, స్టీల్‌ప్లాంట్,
విశాఖపట్నం.

పేరు : మహ్మద్ అనస్
వయసు: 12 సం॥
చదువు: 8వ తరగతి
హాబీలు: చిన్నారి పేజీ చదవడం, క్రికెట్ ఆడటం, పుస్తక పఠనం.
చిరునామా:
మహ్మద్ అనస్,
అల్-హాఫ్ హాస్టల్, ఈద్గా లోపల,
అక్బర్‌బాగ్, సైదాబాద్,
హైదరాబాద్. పిన్: 500 059.

పేరు : కంభంపాటి విశాలి
వయసు : 9 సం॥
చదువు: 5వ తరగతి
హాబీలు: ఆటలు ఆడటం, పాటలు పాడటం, బైబిల్ చదవడం
చిరునామా:
కె.విశాలి,
డాటరాఫ్ విశ్వేశ్వరరావు,
ఈమని (పోస్ట్), దుగ్గిరాల (మం),
గుంటూరు జిల్లా. పిన్: 522 308.

పేరు : పి.వి.చలం
చదువు: 10వ తరగతి
హాబీలు: ఫొటోగ్రఫీ, ప్రజాశక్తి చదవడం, చెస్ ఆడటం, నాణేలు, స్టాంపులు సేకరించడం.
చిరునామా:
పి.వి.చలం,
కేరాఫ్ శ్రీ వెంకటేశ్వర స్టూడియో,
పెన్నాడ (పోస్ట్), పాలకోడేరు (మం),
పశ్చిమ గోదావరి జిల్లా.
పిన్: 534 243.

పేరు : బెల్లంకొండ పుష్పలత
చదువు: 5వ తరగతి
స్కూలు: నివేదిత ఇంగ్లీష్ మీడియం స్కూల్
చిరునామా:
బెల్లంకొండ పుష్పలత,
డాటరాఫ్ రామారావు,
కొట్ల బజారు,
ఇంకొల్లు,
ప్రకాశం జిల్లా. పిన్: 523 167.

పేరు : సి.సుదర్శన్
చదువు: 9వ తరగతి
హాబీలు: చిన్నారి చదవడం, జోక్స్ రాయడం, టీవీ చూడటం.
చిరునామా:
సి.సుదర్శన్,
సన్నాఫ్ రామసుబ్బయ్య,
ఆర్.సి.ఎం. హైస్కూల్,
రామాపురం,
కడప జిల్లా.

పేరు : జీరు ప్రశాంత్‌రెడ్డి
వయసు : 12 సం॥
హాబీలు: ఆటలు ఆడటం, పాటలు పాడటం, సాంకేతిక విద్య గురించి చదవడం.
లక్ష్యం: ఇంజనీర్ కావడం.
చిరునామా:
జీరు ప్రశాంత్‌రెడ్డి,
సన్నాఫ్ సురేష్‌రెడ్డి,
పెద్ద బ్రాహ్మణ వీధి, టెక్కలి (పోస్ట్),
శ్రీకాకుళం జిల్లా. పిన్: 532 201.